News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :123 | ఖమ్మం | బుధవారం, జూన్ 18, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

### ఎల్బీ స్టేడియంలో యోగా డే..
## అందరూ పాల్గొనాలని మెగాస్టార్ పిలుపు



అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జూన్ 20 హైదరాబద్ లోని ఎల్బీ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనుంది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా డే కార్యక్రమం జరగనుంది. జూన్ 21 న అంతర్జాతీయ యోగా వివరాలు 2లో..

### బనకచర్లపై సమాలోచన..
## నేడు అఖిలపక్షం

- సెక్రటేరియట్ లో నేడు సాయంత్రం మీటింగ్
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండికి ఆహ్వానం
- బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఎంపీలకూ ఆహ్వానం
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తోపాటు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్లమెంటు సభ్యులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలు పంపారు.
ఏపీ ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖ వద్దకు బనకచర్ల ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిందని, ప్రాథమిక అధ్యయనంలో, ఈ ప్రాజెక్ట్ 1980 నాటి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించినట్లు కనిపిస్తోందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల నీటి హక్కులను హరించేలా ఉందని పేర్కొన్నారు.దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ఈ ఏడాది జనవరి 22న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిపారు. దీనిపై స్పందించిన కేంద్ర జలశక్తి శాఖ తమకు ఏపీ నుంచి ఎలాంటి డీపీఆర్ అందలేదని పేర్కొందన్నారు. ఇదే అంశంపై తాను సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను కలిశామని వివరాలు 2లో..



### 15 రోజుల్లో 618 మంది
# లీడర్ల ఫోన్లు ట్యాప్

- సొంత పార్టీ నేతలను కూడా వదల్లేదు.. ఎన్నికల ముందు మొత్తం 4 వేల 200 మంది ఫోన్లు ట్యాప్.. విచారణలో విస్తుపోయే నిజాలు !
- 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆపరేషన్ టార్గెట్స్
- నవంబర్ 15 నుంచి 30 మధ్య మొత్తం 4,200 మంది ఫోన్లను ట్యాప్?? చేసిన ప్రభాకర్ రావు టీమ్
- అందులో కాంగ్రెస్, బీజేపీ, సొంత పార్టీ, ఇతర నేతలే 618 మంది
- మావోయిస్టు సానుభూతిపరులుగా సర్వీస్ ప్రొవైడర్లకు ఎస్ఐబీ లిస్ట్
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గుట్టురట్టు చేసిన సర్వీస్ ప్రొవైడర్లు
- సిట్‌కు చేరిన లిస్ట్‌లో పీసీసీ చీఫ్ సహా రాష్ట్రంలోని ముఖ్యనేతలు

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు మొత్తం 618 మంది పొలిటీషియన్ల ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. అలాగే, అందరితో కలిపి మొత్తం 4,200 మంది ఫోన్లను ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తించింది. అసెంబ్లీ ఎన్నికలకు విఘాతం కలిగించే కుట్ర చేస్తున్నారని, మావోయిస్టు సానుభూతిపరుల నెపంతో ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు టీం అదే ఏడాది నవంబర్‌లో సర్వీస్ ప్రొవైడర్లకు లిస్ట్ పంపింది. ఈ లిస్ట్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత డిసెంబర్ మొదటి వారంలో ఎస్ఐబీకి చేరింది. ఆయా నంబర్లు ట్యాపింగ్ లో ఉన్నట్లు సంబంధిత టెలికాం కంపెనీలు ఎస్ఐబీకి లిస్ట్ పంపించాయి. అప్పటికే బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సర్వీస్ ప్రొవైడర్లు అందించిన లిస్ట్ లో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సహా కాంగ్రెస్‌లో కీలక నేతలు, బీజేపీ నేతలు, ఎంపీలు ఈటల రాజేందర్?, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు , వైఎస్ షర్మిల, కాంగ్రెస్, బీజేపీ సహా అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలు, ముఖ్య అనుచరులకు నంబర్లను సిట్ గుర్తించింది. వివరాలు 2లో..

## వైఎస్ షర్మిల ఫోను ట్యాప్

- అన్నకు వాయిస్ రికార్డుల సమాచారం
- తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కాంగ్రెస్ వర్గాలు



తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని కాంగ్రెస్ పార్టీలో ఆమె సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. షర్మిల వివరాలు 2లో..

### ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల
## అప్పులు మిగిల్చారు

- గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆరోగ్య వ్యవస్థ భ్రష్టుపట్టిందన్న సత్యకుమార్
- ఆరోగ్యశ్రీకి రూ.2,500 కోట్లు, మందులకు రూ.1000 కోట్ల బకాయిలున్నాయని వెల్లడి
- ఏడాదిలో మౌలిక వసతులు, సిబ్బంది నియామకంతో మార్పు తెచ్చామన్న మంత్రి



గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ఇతర వ్యవస్థలతో పాటు ఆరోగ్య వ్యవస్థను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించారని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించారని, వివరాలు 2లో..


## నేడు, రేపు ఢిల్లీలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన!

- నేడు 10.30 గంటలకు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో భేటీ కానున్న మంత్రి నారా లోకేశ్
- సాయంత్రం వరుసగా ముగ్గురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్న లోకేశ్
- రేపు కార్మిక శాఖ మంత్రి, యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తోనూ భేటీ కానున్న మంత్రి లోకేశ్



వివరాలు 2లో..

## కుప్పంలో మహిళలను అప్పు తీర్చలేదని చెట్టు కట్టేసిన వైనం



- కుప్పం మహిళ శిరీషను ఫోన్‌లో పరామర్శించిన సీఎం చంద్రబాబు
- కుప్పంలో దారుణ ఘటన
- అప్పు తీర్చకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త
- భార్యను చెట్టుకు కట్టేసిన వైనం
- రూ.5 లక్షల ఆర్థికసాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు
- పిల్లలను బాగా చదివించాలని సూచన

చిత్తూరు జిల్లా కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివరాలు 2లో..

## టీపీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు



- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆరోపణలే ప్రధాన కారణం
- తనపై మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన కేటీఆర్
- కేసీఆర్, కేటీఆర్ గతంలో ఫోన్లను ట్యాప్ చేశారన్న మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపారు. రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణలు చేశారన్న కారణంతో కేటీఆర్ ఈ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. వివరాలు 2లో..

# బాంబుల వర్షం

- ఇరాన్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్
- ఖమేనీ సన్నిహిత సలహాదారు మృతి
- టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు
- నగరాన్ని వీడుతున్న జనం
- జీ7 నుంచి అర్ధంతరంగా వచ్చేసిన ట్రంప్
- కాల్పుల విరమణ కంటే మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నాం.. ఖమేనీ ఎక్కడున్నారో తెలుసని వ్యాఖ్య
- ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు
- మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ దాడి
- ఉద్రిక్తతల తగ్గింపునకు ఐరోపా, అరబ్ దేశాల పిలుపు
- సరిహద్దులు దాటి ఆర్మేనియా చేరుకున్న భారత విద్యార్థులు

వివరాలు 2లో..



### బెంగళూరు విమానాశ్రయంలో
## చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



- లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చెవిరెడ్డి
- చెవిరెడ్డిపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ
- చెవిరెడ్డిని విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించే అవకాశం

వివరాలు 2లో..

## ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి

- ధరణి పోర్టల్ వల్ల ప్రతి గ్రామంలో భూ సమస్యలు ఉన్నాయన్న పొంగులేటి
- భూ భారతి చట్టం ద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలని సూచన
- ప్రజాపాలన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్న మంత్రి



వివరాలు 2లో..

# ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలి

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో వందలాది కుటుంబాలు తీవ్ర భూ సమస్యలతో సతమతమవుతున్నాయని, తెలంగాణ సమాజంలో భూమి అత్యంత కీలకమైన అంశమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటినీ 'భూ భారతి' చట్టం ద్వారా పరిష్కరించాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈరోజు సచివాలయంలో పలువురు నూతన కలెక్టర్లు, అధికారులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ధరణి పోర్టల్‌తో తలెత్తిన చిక్కుల వల్ల రైతులు, ప్రజలు పడిన కష్టాలకు చరమగీతం పాడాలన్నారు. 'భూ భారతి', రెవెన్యూ సదస్సుల ద్వారా వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాబోయే రెండు నెలలు రెవెన్యూ శాఖకు చాలా కీలకమైనవని, భూ సమస్యల పరిష్కారానికి నిర్దేశించిన ఆగస్టు 15వ తేదీ నాటికి చట్టబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలై సుమారు ఏడాదిన్నర కావస్తోందని మంత్రి గుర్తుచేశారు. ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ, సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాల్సిన బృహత్తర బాధ్యత కలెక్టర్లపై ఉందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్లు కూడా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.
మంత్రిని కలిసిన వారిలో కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డితో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ ఉన్నారు.

# బాంబుల వర్షం

ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తీవ్రతరమైంది. ఇరు దేశాల దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. యుద్ధ విమానాలతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అటు ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల వర్షం కురిపిస్తోంది. ఐదో రోజైన మంగళవారం పరస్పరం జరుపుకొన్న దాడుల్లో రెండు వైపులా భారీ నష్టం సంభవించింది.
ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ సన్నిహిత సలహాదారు మరణించారు. ఇజ్రాయెల్‌లోని మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై దాడిచేసిన ఇరాన్.. డ్రోన్ల తయారీ యూనిట్‌ను ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ దాడులతో టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు నగరాన్ని వీడుతున్నారు. ఇక జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అర్ధంతరంగా వాషింగ్టన్ వచ్చేశారు. కాల్పుల విరమణ కంటే మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. దీనిని బట్టి ఏదో జరగబోతోందని అర్థమవుతోందని పరిశీలకులు అంటున్నారు. మరోవైపు ఉద్రిక్తతల తగ్గింపునకు ఐరోపా, అరబ్ దేశాలు పిలుపునిచ్చాయి. ఇరాన్‌లో చిక్కుకున్న కొంత మంది భారత విద్యార్థులు మంగళవారం సరిహద్దులు దాటి ఆర్మేనియాలోకి వచ్చారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అత్యంత సీనియర్ సైనికాధికారి, ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సన్నిహిత సలహాదారు అయిన అలీ షాద్మానీ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ దళాలు వెల్లడించాయి. గతంలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో సీనియర్ సైనికాధికారి అలీ రషీద్ మృతి చెందడంతో.. అలీ షాద్మానీని ఇటీవల సాయుధ దళాలకు నూతన నాయకుడిగా ఖమేనీ నియమించారు. టెహ్రాన్ డౌన్‌టౌన్‌కు సమీపంలోని 3,30,000 మంది ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేసింది. కోటి మంది జనాభా ఉండే ఈ నగరం నుంచి పలువురు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఇప్పటిదాకా ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 224 మంది మరణించారు. 1,277 మంది గాయపడ్డారు. టెహ్రాన్ గగన తలంపై పూర్తి నియంత్రణ సాధించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఎప్పుడంటే అప్పుడు తమ యుద్ధ విమానాలు ఇరాన్ రాజధానిపై దాడులు చేయగలవని పేర్కొంది. 120 క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపింది. టెహ్రాన్ విమానాశ్రయమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేసింది. అక్కడున్న రెండు ఎఫ్-14 యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. దీనికి సంబంధించిన వీడియోలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. దాడుల్లో ఇరాన్ ప్రత్యేక ఎలైట్ దళం కుడ్స్ ఫోర్స్‌కు చెందిన 10 కమాండ్ సెంటర్లు నాశనమైనట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.
ఇరాన్ బ్యాంకులపై ఇజ్రాయెల్ సైబర్ దాడులకు పాల్పడుతోంది. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ల్యాప్‌టాప్‌లపై ఇరాన్ పాక్షిక బ్యాన్ విధించింది.

**మొస్సాద్‌కు దెబ్బ**

ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతి దాడులు చేస్తోంది. మంగళవారం దాదాపు 20 బాలిస్టిక్ క్షిపణులను టెల్ అవీవ్‌పై ప్రయోగించడంతో భారీ నష్టం సంభవించినట్లు సమాచారం. పలు భవనాలు, వాహనాలపై క్షిపణులు పడడంతో మంటలు ఎగసిపడుతున్నట్లు తెలిసింది. మొస్సాద్ ప్రధాన కార్యాలయంపైనా ఇరాన్ దాడులు చేసినట్లు తెలుస్తోంది. టెహ్రాన్‌లో మొస్సాద్ ఏర్పాటు చేసుకున్న డ్రోన్ ఫ్యాక్టరీని ధ్వంసం చేసింది. గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ సైనిక నిఘా కాంప్లెక్స్‌పైనా క్షిపణి ప్రయోగించినట్లు ఇరాన్ తెలిపింది. ఇప్పటిదాకా 370 క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లో 24 మంది మరణించగా.. 500 మందికిపైగా గాయపడ్డారు.

**అంతకు మించి..**

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మరింత తీవ్రమవుతున్న వేళ అధ్యక్షుడు ట్రంప్ తన కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని అమెరికా చేరుకున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సులో భాగంగా మంగళవారం ఆయన కెనడాలోనే పర్యటించాల్సి ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హతమైతేనే యుద్ధం ఆగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ట్రంప్ హడావుడిగా అమెరికా వెళ్లడం ప్రాధాన్యంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ హడావుడిగా సిచువేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు వచ్చారు. రాగానే రక్షణ మంత్రి హెగ్సెత్‌తో భేటీ అయ్యారు. దీంతో ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో అమెరికా చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సిందే. ఇది సుమారు 13,600 కిలోల బరువుంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డీగో గార్సియా బేస్‌కు అమెరికా చేర్చింది. రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలనూ పశ్చిమాసియాకు తరలిస్తోంది. బ్రిటన్ తన ఫైటర్‌జెట్లను మోహరిస్తుండటం ఉద్రిక్తతను పెంచుతోంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక ప్రతినిధి విట్‌కాఫ్‌ను ఇరాన్‌తో చర్చల కోసం పంపుతానని ట్రంప్ తెలిపారు.
ఇజ్రాయెల్‌కే తమ మద్దతు ఉంటుందని జీ7 దేశాల కూటమి ప్రకటించింది. ఇరాన్ ఉగ్రవాద శక్తులను పెంచి పోషిస్తూ పశ్చిమాసియాలో అస్థిరతకు కారణమవుతోందని ఆరోపించింది. హర్మూజ్ జల సంధిలోని ఇరాన్, ఒమన్ తీరాల సమీపంలో మూడు నౌకలు తగలబడుతున్నట్లు సమాచారం.

**అర్మేనియా చేరుకున్న భారతీయ విద్యార్థులు**

ఇరాన్‌లో చిక్కుకుపోయిన 110 మంది భారతీయ విద్యార్థులు అర్మేనియా చేరుకున్నారని విదేశాంగశాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. బుధవారం వారు ఢిల్లీకి రానున్నారని వెల్లడించింది. మరోవైపు టెహ్రాన్‌లోని భారతీయులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులందరూ సొంత మార్గాల్లో నగరాన్ని వీడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని భారత రాయబార కార్యాలయం మరో అడ్వైజరీ జారీ చేసింది.

**ఖమేనీ ఎక్కడున్నాడో మాకు తెలుసు: ట్రంప్**

ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఎక్కడ దాక్కున్నారో తమకు తెలుసని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని సూచించారు. 'ఖమేనీ మాకు సులభమైన లక్ష్యమే. అయితే ఆయనను ప్రస్తుతానికి చంపాలనుకోవడం లేదు. ప్రజలపైనా, అమెరికా సైనికులపైనా క్షిపణులను ప్రయోగించడాన్ని కోరుకోవడంలేదు' అని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికలో ట్రంప్ ప్రకటించారు.

**దిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్**

ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాలు, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్న తెలంగాణవాసులకు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిల్లీలోని తెలంగాణభవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ప్రారంభించింది. ఇప్పటివరకూ రాష్ట్ర వాసులు ఎవరూ ప్రభావితం అయినట్లు సమాచారం లేకపోయినా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ముందుజాగ్రత్తగా ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలను అనుసరించి తెలంగాణభవన్ అధికారులు విదేశాంగ మంత్రిత్వశాఖతోపాటు, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైన తక్షణసాయం అందించడానికి సిద్ధమైనట్లు తెలిపింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తాము ఉంటున్న దేశాల్లోకానీ, ప్రయాణాల్లోకానీ ఇబ్బంది పడుతున్న తెలంగాణవాసులు కింద పేర్కొన్న నంబర్లను సంప్రదించవచ్చని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. వందన- రెసిడెంట్ కమిషనర్ పీఎస్- ‍౦91 9871999044, జి.రక్షిత్‌నాయక్, లైజన్ ఆఫీసర్- ‍౦91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్- ‍౦91 9910014749, సీహెచ్ చక్రవర్తి, పౌరసంబంధాల అధికారి- ‍౦91 9949351270.

# 15 రోజుల్లో 618 మంది లీడర్ల ఫోన్లు ట్యాప్

- మొదటి పేజీ తరువాయి

ఆయా నంబర్లకు ఫోన్లు చేసి సాక్షుల స్టేట్‌మెట్లు రికార్డు చేస్తున్నది. ఫోన్ ట్యాపింగ్ లిస్ట్‌లో ఏపీ గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్?రెడ్డి, కోటంగిరి వినయ్‌కుమార్ రెడ్డి లాంటి నేతలూ ఉన్నారు. లిస్ట్ ఆధారంగా ప్రతిరోజూ సగటున 10 మంది స్టేట్‌మెంట్లను సిట్ అధికారులు రికార్డు చేస్తున్నారు.

**సాక్షులుగా టీపీసీసీ చీఫ్ సహా 9 మంది స్టేట్ మెంట్లు**

2023 నవంబర్ 15 నుంచి 30 మధ్య జరిగిన ఫోన్ ట్యాపింగ్ బాధితుల్లో ఒకరైన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సహా మొత్తం 9 మంది సాక్షులను మంగళవారం సిట్ విచారణ జరిపింది. మహేశ్?గౌడ్?తో పాటు గాంధీ భవన్‌కు చెందిన నలుగురు వర్కర్లు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, గాలి అనిల్ కుమార్, గద్వాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ సరిత, ఆమె భర్త తిరుపతయ్య.. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్?లోని సిట్ ఆఫీసర్ ఏసీపీ వెంకటగిరి వద్ద హాజరై.. సాక్షులుగా తమ వాంగ్మూలం ఇచ్చారు.
పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌సహా కీలక నేతల స్టేట్‌మెంట్ నేపథ్యంలో
జూబ్లీహిల్స్ పీఎస్ వద్దకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా చేరుకున్నారు. దీంతో ప్రణీత్‌రావు, ప్రభాకర్ రావు ఎంక్వైరీని సిట్ వాయిదా వేసింది. ప్రణీత్‌రావును బుధవారం, ప్రభాకర్ రావును గురువారం విచారణకు రావాలని సూచించింది.

# ఆరోగ్య శాఖపై రూ.6,500 కోట్ల అప్పులు మిగిల్చారు

- మొదటి పేజీ తరువాయి

అందుకే ఎన్నికల్లో తగిన తీర్పు ఇచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం దివాళా తీసిన ఆర్థిక వ్యవస్థను వారసత్వంగా ఇవ్వడమే కాకుండా, ఆరోగ్య రంగంపై కూడా సుమారు రూ.6,500 కోట్ల మేర అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల గురించి మంత్రి సత్యకుమార్ వివరిస్తూ, "ఆరోగ్యశ్రీ పథకం కింద చెల్లించాల్సిన బకాయిలు రూ.2,500 కోట్లు, మందుల సరఫరా సంస్థలకు ఇవ్వాల్సినవి రూ.1,000 కోట్లు ఉన్నాయి. వీటితో పాటు వైద్య కళాశాలల నిర్మాణ పనులకు సంబంధించి రూ.700 కోట్లు, నాడు-నేడు కార్యక్రమం కింద మరో రూ.400 కోట్ల అప్పులు కూడా మిగిల్చి వెళ్లారు" అని తెలిపారు. ఇన్ని అప్పులతో ఆరోగ్య వ్యవస్థను గందరగోళంలో పడేశారని ఆయన మండిపడ్డారు.
అయితే, తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే వైద్య ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చామని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. "మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, అవసరమైన మానవ వనరుల సిబ్బంది నియామకం చేపట్టడం ద్వారా ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణను బలోపేతం చేశాం. ముఖ్యంగా, జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 రకాల పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి" అని ఆయన వివరించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల పనితీరును మెచ్చిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రోత్సాహకంగా రూ.100 కోట్లను విడుదల చేసిందని ఆయన వెల్లడించారు. "కేవలం ఏడాది కాలంలోనే ఆరోగ్య శాఖలో ఇంతటి సానుకూల మార్పును తీసుకురాగలిగాం. శాఖను పూర్తిగా గాడిన పెట్టేందుకు, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది" అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

# ఎల్బీ స్టేడియంలో యోగా డే.. అందరూ పాల్గొనాలని మెగాస్టార్ పిలుపు

- మొదటి పేజీ తరువాయి

దినోత్సవం అయితే కౌంట్ డౌన్ గా 20 వ తేదీనే యోగ డే నిర్వహిస్తోంది రాష్ట్ర బీజేపీ. ఈ మేరకు ఎల్బీ స్టేడియంలో జరిగే యోగా డే లో ప్రతి ఒక్కరు పాల్గొవాలని సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో తెలిపారు. చిరంజీవి వీడియోను కిషన్ రెడ్డి షేర్ చేశారు. చిరంజీవి ఏమన్నారంటే.. ప్రతి ఒక్కరు తప్పకుండా డైలీ యోగా చేయాలి. యోగా చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవు. మన ఆత్మ, శరీరం మన ఆధీనంలో ఉంటాయి. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కౌంట్ డౌన్ గా అంటే జూన్ 20న ఉదయం 6 గంటలకు హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న యోగా కార్యక్రమానికి అందరూ పాల్గొనండి..యోగా చేద్దాం అందరూ ఆరోగ్యం ఉందాం జైహింద్. అని చిరంజీవి పిలుపునిచ్చారు. ప్రపంచానికి భారత్ ఇచ్చిన బహుమతి యోగా అని.. జూన్ 21న అందరం కలిసి సెలబ్రేట్ చేసుకోవాలని చిరంజీవి తన ఎక్స్ లో పోస్ట్ చేశారు. సరిహద్దులు దాటి యోగాను సెలబ్రెట్ చేసుకుందామని చెప్పారు.

## బెంగళూరు విమానాశ్రయంలో చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వైసీపీ సీనియర్ నేత, మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని బెంగళూరు విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై మద్యం కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద ఆయను అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. ఆయనను తదుపరి విచారణ నిమిత్తం విజయవాడలోని సిట్ కార్యాలయానికి తరలించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## కుప్పంలో మహిళలను అప్పు తీర్చలేదని చెట్టు కట్టేసిన వైనం

గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా? అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమె చెప్పింది. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని చంద్రబాబు అన్నారు. ఇక, శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో కూడా సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని....ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి... అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని శిరీషకు ఫోన్‌లో సీఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## నేడు, రేపు ఢిల్లీలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన!

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీకి వెళ్లారు. నిన్న రాత్రి ఢిల్లీ చేరుకున్న ఆయన, నేడు, రేపు అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఢిల్లీలో లోకేశ్ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ రోజు ఉదయం 10.30 గంటలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో ఆయన భేటీ అవుతారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు.
అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో లోకేశ్ సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సాయంత్రం 5.30 గంటలకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు.
రేపు (19వ తేదీ) గురువారం ఉదయం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవియాతో ఆయన భేటీ అవుతారు. అనంతరం యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో కూడా మంత్రి లోకేశ్ సమావేశం కానున్నారు.

## టీపీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

కొంతకాలంగా తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. పలువురు రాజకీయ నాయకులు, అధికారుల పేర్లు ఈ కేసులో వినిపిస్తున్నాయి. ఈరోజు మీడియా సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. చట్ట వ్యతిరేకంగా ఎంతోమంది ఫోన్లను ట్యాప్ చేశారని, సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు తెలిసిందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే కేటీఆర్ లీగల్ నోటీసులు పంపినట్టు తెలుస్తోంది.

## బనకచర్లపై సమాలోచన.. నేడు అఖిలపక్షం

- మొదటి పేజీ తరువాయి

తెలిపారు.
ఆ తర్వాత కూడా పలుమార్లు లేఖలు రాసినట్లు తెలిపారు. ఏపీ జలశక్తి శాఖకు ప్రతిపాదనలు పంపినందున దీనిని అడ్డుకొనేందుకు ఎలా ముందుకెళ్లాలనే విషయం చర్చించేందుకు రావాలని అన్ని పార్టీలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ని కూడా ఆహ్వానించామని వివరించారు.

## వైఎస్ షర్మిల ఫోను ట్యాప్

- మొదటి పేజీ తరువాయి

ఫోన్‌ను ట్యాప్ చేసి, వాయిస్ రికార్డులు సేకరించారని.. ఎవరెవరితో మాట్లాడుతున్నారనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆమె అన్న జగన్‌కు చేరవేసినట్లు ఆరోపిస్తున్నారు. షర్మిల మొబైల్ ట్యాపింగ్‌కు కోడ్ భాష వినియోగించారని, ఆమెతో ఫోన్లో మాట్లాడే ప్రతి ఒక్కరిపైనా నిఘా వేశారని చెబుతున్నారు. దగ్గరి మనుషులను ఓ సీనియర్ పోలీసు అధికారితో పిలిపించి, హెచ్చరించారని పేర్కొన్నారు. తన ఫోన్లు ట్యాప్ అవుతున్నట్లు అప్పట్లోనే షర్మిల గుర్తించినా బయటపెట్టలేదని కాంగ్రెస్ వర్గాలు చెప్పాయి. ఇందులో వాస్తవం ఎంతో స్పష్టత రావాల్సి ఉంది.

# ఎంపీ రఘురాం రెడ్డి ఔదార్యంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు

- క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణ కుమారి, కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్
- పాల్గొన్న ఐఎన్ టీయూసీ బాధ్యులు
- వివిధ అడ్డాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన ఆటో డ్రైవర్లు



**సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం:** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఔదార్యం చూపి ఆటో డ్రైవర్ల కోసం ఖాకీ చొక్కాలను సిద్ధం చేయించారు. నగరంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంపు కార్యాలయంలో మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ వివిధ అడ్డాల నుంచి తరలివచ్చిన ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా.. మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆటో డ్రైవర్లకు.. యూనిఫామ్ చొక్కాలను ఎంపీ సమకూర్చడం..ఎంతో సంతోషకరమని అన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.
ఈ కార్యక్రమంలో..: ఐ ఎన్ టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్. విప్లవ్ కుమార్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, నాయకులు పరికిపల్లి శ్రీను, ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు జంగిపల్లి ప్రసాద్, సంఘం బాధ్యులు సిద్ధల నగేష్, తోట సైదులు, కే. మధు, ఏ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కోడిపందాలు, పేకాట నిర్వాహకుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి,జూన్ 17,** భద్రాచలం పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి కోడి పందాలు, పేకాట నిర్వహిస్తున్నారు. ఈ విధమైన అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వల్ల యువత ఈ వ్యసనాల కు బానిసలై వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

పేకాట, కోడిపందాల నిర్వహణ ఆంధ్ర ప్రాంతం భద్రాచలం సరిహద్దుల్లో జరుగుతున్నప్పటికీ నిర్వహణ నిర్వాహకులందరూ భద్రాచలం ప్రాంతాని కి చెందినవారు. నిర్వాహకులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఎస్సై జి.స్వప్న కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఎన్.ఎస్.యు.ఐ తరపున ఫిర్యాదు చేశారు.
ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, రాహుల్ గాంధీ సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో అంగన్వాడి టీచర్ పిల్లలు



**జూన్ 17 ( సీ కే న్యూస్) చేగుంట** :మెదక్ జిల్లా చేగుంట మండల్ పోల్లంపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్, వివరాల్లోకి వెళితే పోలంపల్లి అంగన్వాడి టీచర్ మమత శ్రీనివాస్, కుమారులు 2024 వరకు ప్రైవేట్ పాఠశాలలో విద్యాబోధన చేసినారు, కొన్ని కారణాలవల్ల రెండు సంవత్సరాలు ప్రైవేట్ పాఠశాలలో చదివించడం జరిగింది, కానీ ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అనేది ప్రభుత్వ ఉద్యోగులు అనేవారు ఎంతో కష్టపడితే చదివితే గాని ఉద్యోగాలు రావు అలాంటప్పుడు మన గ్రామంలో మన పిల్లలను ప్రైవేటు పాఠశాలల కంటే గవర్నమెంట్ పాఠశాలలో చదివించాలి నాణ్యమైన విద్య లభిస్తుంది ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే వారికి ప్రభుత్వం నుండి అనేక సౌకర్యాలు లభిస్తాయి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే వారికి ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫ్, మధ్యాహ్నం భోజనం వంటి సౌకర్యాలు లభిస్తాయి అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన చెప్పే ఉపాధ్యాయులు అనుభవజ్ఞులు మరియు అర్హులుగా ఉంటారు కాబట్టి ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే విద్య బోధన బాగుంటుంది అందుకే నేను నా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని, నిర్ణయం తీసుకోవడం జరిగింది, ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు, పాల్గొన్నారు

# అంగన్వాడీ కేంద్రాలను కార్పొరేట్ స్థాయి వసతులతో అభివృద్ధి.

- కలెక్టర్ జితేష్ వి పాటిల్.
- అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని చిన్నారులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రతినిధి (సాయి కౌశిక్),జూన్ 17,** పాత పాల్వంచలోని మండల ప్రాథమిక పాఠశాలల లోని అంగన్వాడీ కేంద్రంలో "అమ్మ మాట %–% అంగన్వాడి బాట" కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని అంగన్వాడీ విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా తీర్చిదిద్ద బడి జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుదీకరణ, త్రాగునీటి , మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పిల్లలకు అవసరమైన ఆహారం, విద్య, ఆటపాటల వాతావరణం, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు అన్నింటిని సమగ్రమైన విధంగా అందిస్తున్నారు అని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అనుభవజ్ఞులైన టీచర్లను నియమించి వారికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని, వారు చిన్నారుల మానసిక, భౌతిక అభివృద్ధికి తగిన తరగతులు నిర్వహిస్తున్నారని వివరించారు.
తల్లిదండ్రులందరు చిన్నారులను ఖరీదైన ప్రైవేటు పాఠశాలలలో చేర్పించి ఆర్థిక భారాన్ని మోసుకోవడం అవసరం లేదు అని,అంగన్వాడీ కేంద్రాల్లోనే ఆధునిక వసతులతో కూడిన విద్యాబోధన అందుబాటులో ఉంది. ముందు అంగన్వాడీలలో చేర్పించి, తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి. ఇవే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయి" అని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్రం మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, మహిళా శిశు, వయోవృత్తుల మరియు దివ్యంగుల శాఖ అధికారి స్వర్ణలత లేని నా, ఐసిడిఎస్ పిడి ,సిడిపిఓ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, పిల్లల, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# కరకట్ట నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.





- గోదావరి ముంపు నుండి భద్రాచలాన్ని రక్షించాలి...
- చిత్తశుద్ధి లేని జిల్లా మంత్రుల హామీలు ...
- పోలవరం బ్యాక్ వాటర్ వల్ల భద్రాచలానికి జరిగే నష్టానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలి.
- పోలవరం బ్యాక్ వాటర్ ముంపు పై 'రీ సర్వే' చేయించాలి.
- నత్త నడకన నడుస్తున్న కరకట్ట నిర్మాణం పనులు..
- కరకట్ట నిర్మాణం పనులను పరిశీలించిన సిపిఎం జిల్లా బృందం...
- కరకట్ట నిర్మాణం పనులపై ఇరిగేషన్ ఈ ఈ తో మాట్లాడిన సిపిఎం బృందం.
- హై లెవెల్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేసి ఎస్టిమేషన్స్ పంపాము..
- పోలవరం బ్యాక్ వాటర్ ముంపు సర్వే పై జాయింట్ సర్వేకు అప్పీలు చేశాము...
- సిపిఎం బృందంతో ఇరిగేషన్ ఈఈ వెల్లడి...

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** భద్రాచలం పట్టణం గోదావరి ముంపుకు గురి కాకుండా 38 కోట్లతో సుభాష్ నగర్ కాలనీ వైపు నిర్మిస్తున్న కరకట్టను త్వరితగతిన పూర్తి చేయాలని, గోదావరి ముంపు నుండి భద్రాచలం పట్టణాన్ని రక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు,రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ లు అన్నారు. నిర్మాణంలో ఉన్న కరకట్ట పనులను సిపిఎం బృందం నేడు పరిశీలించింది. అనంతరం ఇరిగేషన్ అధికారులను కలిసి కరకట్ట పనులకు సంబంధించిన అంశాలను చర్చించడం జరిగింది. టిఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన కరకట్టను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ కరకట్ట పనులు పూర్తి కాలేదని నత్తనడకన పనులు సాగుతున్నాయని వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు జిల్లాలోని ముగ్గురు మంత్రులు కరకట్టను త్వరితగతిన పూర్తి చేస్తామని భద్రాచలం ముంపు నుండి రక్షిస్తామని హామీలు గుప్పించి ఆ మాటే మరిచారని అన్నారు. ప్రారంభంలో హడావుడి చేసిన మంత్రులకు కరకట్ట నిర్మాణం పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. వర్షాకాలం వచ్చే లోపు కరకట్ట పూర్తి చేస్తామని ప్రగల్బాలు పలికిన మంత్రులు కరకట్ట ఇంకా ఎందుకు పూర్తి కాలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భద్రాచలం ఎంపీ,ఎమ్మెల్యేలకు ఈ సమస్య పట్టదని విమర్శించారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల భద్రాచలానికి జరిగే నష్టానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. నిత్యం రామజపం చేసే బిజెపి వారికి భద్రాచలం రాముడు మునుగుతున్న పట్టదా అని ప్రశ్నించారు.పోలవరం బ్యాక్ వాటర్ ముంపు పై రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు.. గతంలో నిర్మించిన పాత కరకట్టను ఎత్తు పెంచి, పొడిగించి పటిష్టంగా నిర్మించేందుకు కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని అన్నారు. గోదావరి ఫ్లడ్ మాన్యువల్ ను మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కరకట్టను పూర్తి చేసి పాత కరకట్టకు నిధులు మంజూరు చేయాలని లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో దశల వారి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ఇరిగేషన్ అధికారులతో సిపిఎం బృందం భేటీ
కరకట్ట పనులు పరిశీలన అనంతరం ఇరిగేషన్ ఈ ఈ,డి ఈ జేఏలతో సిపిఎం బృందం భేటీ అయింది. కరకట్ట పనులు ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఈ ఈ మహమ్మద్ జానీ మాట్లాడుతూ కరకట్ట నిర్మాణంలో అంతర్భాగమైన హై లెవెల్ రోడ్డు నిర్మాణానికి సర్వే చేసి ఎస్టిమేషన్స్ నేషనల్ హైవే అధికారులకు పంపడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తిచేసి సుభాష్ నగర్ కాలనీ లోకి వరద రాకుండా తగు చర్యలు చేపడతామని అన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ ముంపు పై ఆంధ్ర,తెలంగాణ అధికారులతో జాయింట్ సర్వేకు అప్పీలు చేశామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హైదరాబాద్ ఐఐటి ఇంజనీరింగ్ నిపుణులతో సర్వే చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు.
ఈ సర్వే బృందంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్ అజయ్ కుమార్ ధనకొండ రాఘవయ్య కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# పెబ్బేరుకు చెందిన బాధితుడు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు.....

- ప్రజలతో ఏ విధంగా ప్రవర్తిస్తాడో తెలుస్తుంది....
- మున్సిపల్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలి....

**(బ్రేకింగ్ న్యూస్ (సి కే న్యూస్)** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ లోని మేనేజర్ గణేష్ బాబు పై చర్యలు తీసుకోవాలని పెబ్బేరుకు చెందిన బాధితుడు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.
జనన ధ్రువీకరణ పత్రం కొరకు వచ్చిన ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాడని తెలిపారు.
జనన ధ్రువ పత్రం కోసం దరఖాస్తు చేసుకొని రోజులు గడుస్తున్న పట్టించుకోకుండా ఇష్టానుసారంగా బాధితులను దూషిస్తున్నారని అన్నారు.
మున్సిపల్ కమిషనర్ చెప్పినా కూడా నేనే రాజు నేనే మంత్రి ఎవ్వరికీ చెపుకుంటావో చేపుకో అని బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.
మున్సిపల్ మేనేజర్ గతంలో మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు చేపట్టి వారం రోజులకే తన సీట్ స్థానంలో మున్సిపల్ కమిషనర్ గా అశోక్ రెడ్డి బభాధ్యతలు తీసుకోవడంతో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి మాట కూడా వినడం లేదని సిబ్బంది చెవులు కొట్టుకుంటున్నారని తెలిపారు.
కమిషనర్ సీటు వచ్చినట్లే వచ్చి ఊసిపోవడంతో కోపమంతా ప్రజలపై చూపిస్తున్న మున్సిపల్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.
పెబ్బేరు ప్రజలకు మున్సిపల్ మేనేజర్ గణేష్ బాబుతో అవసరం పడితే చుక్కలు చూపిస్తున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.
మున్సిపల్ లో ఉన్న సిబ్బంది కూడా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రజలకు ముప్పు తిప్పలు పెడుతున్నారు.
చదువుకున్న తల్లిదండ్రులకే ఇలాంటి తిప్పలైతే ఏమి తెలియని అమాయకులను ఎన్ని ముప్పు తిప్పలు పెడుతున్నారో ఒకసారి ఆలోచించాలని ఆవేదన వ్యక్తం చేశారు.
మున్సిపల్ మేనేజర్ పై జిల్లా కలెక్టర్ కు ,స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి లకు చేయడం జరుగుతుందని తెలిపారు.
పైరవికారులకు తొందరగా పనులు చేసుకుంటూ ప్రజలకు సహకరించకపోవడంతో ఏమిటని ప్రశ్నిస్తున్నారు.
ఆయనపై మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని పెబ్బేరు ప్రజలుగా కోరుతున్నారు.




# ప్రధానిగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న మోదీ.

- రాజ్యాంగాన్ని కాపాడే పార్టీ బిజెపి పార్టీ, రాజ్యాంగాన్ని కాలరాసే పార్టీ కాంగ్రెస్.
- బిజెపి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 16.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.
నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న. సందర్భంగా భారతీయ జనతా పార్టీ వికసిత్ భారత్ అమృతకాలం అనే కార్యక్రమం.కార్యశాల వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ మండల కన్వీనర్ లోడే లింగస్వామి అధ్యక్షతన స్థానిక సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ హాజరై.వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పరిపాలన గ్రామాలు, సుభిక్షంగా కేంద్ర ప్రభుత్వ నిధులతోటి అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని, రైతులకు, మహిళలకు , అనేక రకాల కుల వృత్తుల వారికి మోడీ సంక్షేమ ఫలాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప చేతలు ఏమాత్రం చేయడం లేదని తీవ్రంగా విమర్శించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం చేసినటువంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని అందుకుగాను కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పని చేయాలని.కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షులు కార్యకర్తలు రోజువారి కార్యక్రమ ప్రణాళికలు తయారు చేసుకొని ప్రజల్లోకి మోదీ సంక్షేమ కార్యక్రమాలను తీసుకెళ్లాలని. కార్యకర్తలకు తెలియజేశారు. గుర్నాథ్ పల్లి. మొగిలిపాక. గ్రామాల నుండి బిజెపి పార్టీలో చేరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీ ఎన్ రెడ్డి, వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ ఏల చంద్రశేఖర్,జిల్లా నాయకులు కొప్పుల యాది రెడ్డి, రాచకొండ కృష్ణ, బంధారపు రాములు కందుల తానేష, మందుల లక్ష్మి, బొడిగె ఆనంద్, బ చ్చు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మచ్చగిరి,రేగూరి అమరేందర్, వికసితు భారత్ మండల కో కన్వీనర్ మందడి రంజిత్ రెడ్డి, గంగాధర్ దయాకర్, మందుల నాగరాజు, ఎదురుగట్ల వెంకటేశం, వివిధ మోర్చాల అధ్యక్షులు చిన్నం అంజమ్మ, కొత్త రామచంద్రం, పిన్నింటి నరేందర్ రెడ్డి, మీసాల స్వామి,ఎర్రబోలు జంగయ్య, కీర్తి వెంకటేశం, రాధారం మల్లేష్, చెరుకదానయ, రేగు శ్రీధర్, పోల్ నాగయ్య వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సీఈఓ ఎల్లయ్య ను సన్మానించిన ఏంఈఓ నీరజ



**జూన్ 17 ( సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట, జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న కిచెన్ షెడ్యూల్ను పరిశీలించిన జడ్పీ సీఈఓ ఎల్లయ్య
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణంలో ఉన్న కిషన్ షెడ్డును పరిశీలించిన జడ్పీ సీఈఓ ఎల్లయ్య, మధ్యాహ్న భోజనం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసినారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించినందుకు అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోఎంఈఓ నీరజ, ఎంపీడీవో చిన్నారెడ్డి, రావుల వెంకటేష్, సురేందర్, సుధాకర్ రెడ్డి, సరస్వతి, శ్రీవాణి, భవాని, ఉమాదేవి, రమ, తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.




- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** జిల్లా రహదారులపై ప్రమాదాలు జరగకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా ఎస్ పి రోహిత్ రాజు తో కలసి రహదారి భద్రతపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో ఆ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ఈ నెల చివరి నాటికి రహదారులపై ఉన్న గుంతలు అన్ని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స నిమిత్తం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తరపున ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్‌వో ను ఆదేశించారు. ముందుగా జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి కి వెళ్లి రహదారి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న గుర్తించిన ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు గల కారణాల పై అధ్యయనం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆసుపత్రుల కు తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, హాస్పిటళ్లను ఎంపిక చేయాలని తెలిపారు. అదేవిధంగా అంబులెన్స్‌లు, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రామవరం ట్రామా కేర్ కేంద్రం నిర్మాణ పనులను త్వరితగతిగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం లో సిపిఆర్ మానిక్యూర్ కిట్లు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.ప్రమాదాలు సంభవించకుండా రహదారులపై సైన్ బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువ గా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశంలో గుర్తించి వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని. కళాశాలలు మరియు పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ళలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద బజార్ మరియు చిన్న బజార్ ప్రాంతాలలో పార్కింగ్ కొరకు అనువైన స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు.రహదారుల్లో ప్రమాదాల నియాత్రలకు అన్ని శాఖలు సమన్వయం గా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం రహదారి భద్రతపై రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్,జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాపాడే పార్టీ బిజెపి పార్టీ, రాజ్యాంగాన్ని కాలరాసే పార్టీ కాంగ్రెస్.

బిజెపి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 16.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్న. సందర్భంగా భారతీయ జనతా పార్టీ వికసిత్ భారత్ అమృతకాలం అనే కార్యక్రమం.కార్యశాల వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ మండల కన్వీనర్ లోడే లింగస్వామి అధ్యక్షతన స్థానిక సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ హాజరై.వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పరిపాలన గ్రామాలు, సుభిక్షంగా కేంద్ర ప్రభుత్వ నిధులతోటి అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని, రైతులకు, మహిళలకు , అనేక రకాల కుల వృత్తుల వారికి మోడీ సంక్షేమ ఫలాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప చేతలు ఏమాత్రం చేయడం లేదని తీవ్రంగా విమర్శించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం చేసినటువంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బిజెపి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని అందుకుగాను కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పని చేయాలని.కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మండల పార్టీ అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షులు కార్యకర్తలు రోజువారి కార్యక్రమ ప్రణాళికలు తయారు చేసుకొని ప్రజల్లోకి మోదీ సంక్షేమ కార్యక్రమాలను తీసుకెళ్లాలని. కార్యకర్తలకు తెలియజేశారు. గుర్నాథ్ పల్లి. మొగిలిపాక. గ్రామాల నుండి బిజెపి పార్టీలో చేరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీ ఎన్ రెడ్డి, వికసిత్ భారత్ జిల్లా కన్వీనర్ ఏల చంద్రశేఖర్,జిల్లా నాయకులు కొప్పుల యాది రెడ్డి, రాచకొండ కృష్ణ, బంధారపు రాములు కందుల తానేష, మందుల లక్ష్మి, బొడిగె ఆనంద్, బ చ్చు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ మైసొల్ల మచ్చగిరి,రేగూరి అమరేందర్, వికసితు భారత్ మండల కో కన్వీనర్ మందడి రంజిత్ రెడ్డి, గంగాధర్ దయాకర్, మందుల నాగరాజు, ఎదురుగట్ల వెంకటేశం, వివిధ మోర్చాల అధ్యక్షులు చిన్నం అంజమ్మ, కొత్త రామచంద్రం, పిన్నింటి నరేందర్ రెడ్డి, మీసాల స్వామి,ఎర్రబోలు జంగయ్య, కీర్తి వెంకటేశం, రాధారం మల్లేష్, చెరుకదానయ, రేగు శ్రీధర్, పోల్ నాగయ్య ఎలిమినేటి వెంకటేశం వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# జవహర్ నగర్ లో అంత నా ఇష్టం నేనే రాజు నేనే మంత్రి

- అని పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తలను దూరం చేస్తున్న ఒకవర్గం నాయకుడు
- అధికారంలోకి వచ్చిన మారని కాంగ్రెస్ లోని వర్గ వ్యవహారాలు
- సీనియర్ నాయకుల దృష్టికి తీసుకు వెళ్తా అంటున్న ఓబిసి విభాగం అధ్యక్షులు రవి ముదిరాజ్



**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కొరకు పార్టీ అధికారం కొరకు ఎంతో మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కష్ట పడితేనే ఈ రోజు తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది,కానీ మేడ్చల్ నియోజక వర్గం లో కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్య కర్తలను వర్గాలుగా. విభజించి. పాలిస్తున్నారు,ఎందుకంటే ఈ రోజు రాష్ట ప్రభుత్వం పేదింటి ఆడ బిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపడానికి కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ కార్యక్రమం మేడ్చల్ నియోజక వర్గంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి గారి హాజరు కావడం జరిగింది,

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు అలాగే ముఖ్య కార్య కర్తలకు చాలా మంది కి ఈ కార్యక్రమం గురించి ఎలాంటి సమాచారం లేకుండా నిర్వహించడం బాధాకరం,ఒక వర్గానికి చెందిన నాయకులు మాత్రమే ప్రభుత్వ పథకాలకు ఇలాంటి కార్యక్రమాలకు వారికి వారే లీడర్లుగా మాకు ఎవరితో సంబంధం లేకుండా నిర్వహించడం విడ్డూరంగా ఉందని మిగతా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు,మాకు మేమే"మేము చెప్పిందే వేదం.. అన్నట్లు గా కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యక్రమాలు నిర్వహిస్తూ పోతువుంటే, మిగతా కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీలో ఉన్నట్ల లేనట్ల, అలాంటి పార్టీ కార్యకర్తల వారికి మీరు ఏమని సమాధానం చెబుతారు అనిప్రశ్నిస్తున్న,అలాగ్ కాంగ్రెస్ పార్టీ తీసుకువస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమాలకు మాకు నచ్చిన వాళ్ళకే సమాచారం ఇస్తాం,మాకు నచ్చని వాళ్లకు సమాచారం ఇవ్వము, రోజు మాతో పాటు వెనుక తిరిగే వాళ్ళకు మాత్రమే పార్టీ కార్యక్రమాలకు సమాచారం ఇస్తాం,అని చెబితే బాగుంటుంది అని నా అభిప్రాయం,ఇలాంటి ఒంటెద్దు పోకడాలతో

ఇలాంటి గ్రూపు రాజకీయాలు చేసే ప్రతి ఒక్కరూ మానుకుంటే పార్టీకి పార్టీని నమ్ముకున్న చాలా మందికి అంత మంచే జరుగుతుంది,లేదంటే మేడ్చల్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాన్ని గౌరవ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారి దగ్గరకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వెళ్లి వారికి పిర్యాదు ఇవ్వడానికి వెనుకకు పోము అని తెలియజేస్తూన్నాను ,

ఎకనైనా అలాంటి గ్రూపు రాజకీయాలు మానుకొని ప్రతి కార్యకర్తలను అందరిని కలుపుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా ముందుకు పోవాలి అని తెలియజేస్తూ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం అధ్యక్షులు జి రవి ముదిరాజ్ డిమాండ్ చేశారు

# మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి..




- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి..
- జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశం లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** భద్రాద్రి కొత్తగూడెంను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం జిల్లా ఎస్ పి రోహిత్ రాజు తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు,యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించకుండా ఉండేలా కళాశాల యజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యాసంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ టీచర్ సమావేశాల్లో డ్రగ్స్, గంజాయి వినియోగం వల్లే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు.గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాల పై యదార్థ సంఘటన ఆధారంగా వారి భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపడుతుందో వీడియోల ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాలు ద్వారా అలవాటు మానిపించాలన్నారు. చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదకద్రవ్యాలను అలవాటు పడిన పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్పోస్టుల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి తో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలన్నారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములను పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్స్పెక్టర్కు సూచించారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఆలోచన విధానం, ఆలోచన శక్తి నశిస్తాయన్నారు. భావితరాలు మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

**మాదకద్రవ్యాలు వినియోగించిన, రవాణా చేసిన పిడి యాక్టర్ నమోదు చేస్తాం : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.**

మాదకద్రవ్యాలు వినియోగించిన లేదా రవాణా చేసిన పీడి యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఇప్పటివరకు 3,500 కేజీల గంజాయిని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. జిల్లాకు ఒరిస్సా నుండి వయా సీలేరు ద్వారా అటవీ ప్రాంతం నుండి గంజాయి రవాణా నియంత్రించేందుకు భద్రాచలం చెక్ పోస్ట్ ద్వారా 24 గంటల పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి గంజాయి రవాణా ను అడ్డుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా మాదకద్రవ్యాలు గుర్తించేందుకు రెండు నార్కోటిక్ డాగ్ లను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. దానికి గాను రాష్ట్రస్థాయిలో అవార్డు కూడా అందుకున్నామన్నారు. ఆధ్యాత్మిక సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జిల్లాలో మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. మాదకద్రవ్య ల వినియోగం పట్ల విద్యార్థులకు మరియు యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వాటి వినియోగం వల్ల పడే శిక్షల గురించి తెలపాలని అధికారులకు సూచించారు. పాఠశాల లో పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాలు వినియోగాన్ని అడ్డుకునేందుకు డ్రగ్ టెస్టింగ్ కిట్లను కూడా అందుబాటులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలంలో డి ఎడిక్షన్ సెంటర్ ను కూడా అందుబాటులో తీసుకువచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో భద్రాచలం ఏ.ఎస్.పి విక్రాంత్ సింగ్, ఎక్సైజ్ సూపర్ టెంట్ జానయ్య, ఇల్లందు డి ఎస్పీ రమణమూర్తి, కొత్తగూడెం ఆర్ టి ఓ వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వాళ్ళందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే..

అన్నారుగూడెం బడిబాట సదస్సులో విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనగుర్తి శ్రీనివాసచారి..

**తల్లాడ/ జూన్ 17 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**
ప్రస్తుతం వివిధ హోదాల్లో అధికారులుగా ఉద్యోగాలు చేస్తున్న వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో మన ఊరు, మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ ఎన్. దామోదర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయన్నారు. పేరు, ప్రఖ్యాతల కోసం ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించవద్దన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తొలుత మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, నాయకులు మారెళ్ళ లక్ష్మణరావు ప్రభుత్వ పాఠశాలల యొక్క స్థితిగతుల గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరిట్ సాధించిన విద్యార్థులకు తల్లాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ బొజ్జా అప్పారావు, మహమ్మదీయ విద్యాసంస్థల అధినేత ఎస్కే అబ్దుల్ పాషా, గ్రామ పూర్వ విద్యార్థులు ధారా విష్ణు మోహన్ రావు, గోవిందు శ్రీనివాసరావు, ఆపతి రామారావు, తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, పూనాటి సత్యమయ్య, దుగ్గినేని గోపయ్య, నున్న సాందీవులు, తల్లాడ విద్యుత్ ఏఈ రమేష్, తల్లాడ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కొరటికల్ ఉన్నత పాఠశాలలో నూతన అడ్మిషన్ల జోరు.....



**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్**
ఒకే రోజు 12 మంది విద్యార్థుల అడ్మిషన్లు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కోరటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొరటికల్, పోతిరెడ్డిపల్లి 12 మంది విద్యార్థులు నూతనంగా అడ్మిషన్లు పొంది పాఠశాలలో చేరారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దడిపల్లి వెంకన్న మాట్లాడుతూ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యార్థులు అని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా దుస్తువులు,పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుంది. గ్రామాల్లోని పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థులు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గాడిపల్లి ఉదయ్ కుమార్, కోల సోమేష్, నరకుడుబిందెల శ్రీహరి, వెలిమినేటి పురుషోత్తం, కోల రవి, ఏళ్లబోయిన శ్రీశైలం, ఉపాధ్యాయులు చిన్నం స్వామి,రవి కుమార్,వర ప్రసాద్,శ్రీనివాసా చారి,అనురాధ,వెంకటేష్,తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ద

# అర్థిక సహాయం అందజేత.



**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 16.** యాదాద్రి భువనగిరి జిల్లా:-వలిగొండ మండల్:- వేములకొండ గ్రామానికి చెందిన కాడిగళ్ల రాములమ్మ గారు చాలా రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు , సమాచారం తెలిసిన వెంటనే వారి యొక్కకుటుంబ సభ్యులకి (%ూజీ=% ఫౌండేషన్) ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో (5000 వేల రూపాయలు ) అందజేశారు..

ఈ కార్యక్రమంలో వేములకొండ గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల వెంకన్న, కేసి రెడ్డి, జనార్ధన్ రెడ్డి, బోడ బాలయ్య, మట్టి పల్లి రమేష్, కాడిగళ్ల నరసింహ, కాడిగళ్ల దేవేందర్, కాడిగళ్ల రాములు,%ూజీ=% టీం సభ్యులు పాల్గొన్నారు

## తక్షణమే సౌదా ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,**కొత్తగూడెంలో సౌదా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగాలను నియమకాల ప్రక్రియ నిలిపివేయాలని కోరుతూ సింగరేణి డివైజిఎం పర్సనల్ కి వినతిపత్రం ఇచ్చిన కార్మిక సంఘాల బృందం గత నాలుగు రోజులుగా కొత్తగూడెంలో సింగరేణి ఓసి లో ఉద్యోగాల పేరుతో సౌదా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ నియామకాల ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సింగరేణి డివైజియం పర్సనల్ మోహన్ రావు కి అన్ని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్ సంజీవ్, హైట్ శివ,జెట్టి మోహన్,రవి గౌడ్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి నాయకులు ఆల్బర్ట్, హెచ్ ఎం ఎస్ నాయకులు గడపల్లి కృష్ణ ప్రసాద్, సిఐటియు భూక్యా రమేష్, ఐఎఫ్టియు నాయకులు గౌని నాగేశ్వర్ రావు బి ఎం ఎస్ రఘు లు ప్రసంగిస్తూ ఎన్నో ఏండ్లుగా సింగరేణి ఆనవాయితీ ప్రకారం కంపెనీ వారే ఇంటర్వ్యూలు బయోడేటాలు తీసుకొని ఉద్యోగాలు ఇస్తారు కానీ కొత్తగా వచ్చిన సౌదా కంపెనీ ప్రైవేట్ ఏజెన్సీ లాగా కొత్తగూడెంలో నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగా నియమకాల పేరుతో నియామకాల ప్రక్రియ మొదలుపెట్టిందని దీనిని తక్షణమే నిలిపివేయాలని వారన్నారు. మొదటిగా సౌదా కంపెనీ ఆఫీస్ మేనేజ్మెంట్కు వినతిపత్ర రూపంలో అన్ని కార్మిక సంఘాలు తెలియజేసినప్పటికీ ఫలితం లేదు కావున ఈరోజు సింగరేణి కొత్తగూడెం జిఎం కార్యాలయం ముందు డివైజియం కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. తక్షణమే ఈ సౌదా ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని వీటి వలన 600 కార్మిక స్థానిక కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోతాయని వారన్నారు. సింగరేణి ఓసి కోసం 600 కుటుంబాలు భూములను ఇండ్లను బతుకుతెరువును కోల్పోయి సింగరేణి లాభాలపేక్షను కోసం వారు నిర్వాసితులుగా మారారు. అన్ని కోల్పోయిన జీవనోపాధితో ఆ ఓసీలలో బ్రతుకుతెరువు కొనసాగిస్తున్నారు కానీ నేడు సౌదా కంపెనీ రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్ ప్రకటించడంతో ఇక్కడ ఉన్నటువంటి 600 స్థానిక కుటుంబాలు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉన్నది కావున ఈ సౌదా నిర్వహిస్తున్న ఉద్యోగాల నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని లేకపోతే దశల వారి ఆందోళన చేయవలసి వస్తుందని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు చిన్ని, వాసు, ఆంజనేయులు,రామ్ చందర్, యాకయ్య, అశోకు, నాగయ్య,శ్రీను,రవి,మాధవరావు,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా సరి కొండ శ్రీనివాసరాజు



**తల్లాడ, జూన్ 17 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా సరికొండ శ్రీనివాసరాజును సత్తుపల్లి నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కేతినేని హరీష్ నియమించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ తల్లాడ మండల కేంద్రంలో కేతినేని థియేటర్ ఆవరణంలో కార్యకర్తల సమావేశం నిర్వహించగా అన్ని గ్రామ కమిటీలు ఆమోదం తెలుసుకొని మండల కమిటీ ఎన్నిక నిర్వహించామన్నారు.
లి : తల్లాడ పట్టణ టీడీపీ నూతన కమిటీ ని, మండల ఉపాధ్యక్షులు రావూరి రవి ప్రసాద్ , ఉపాధ్యక్షుడు
మోకర దోనేష్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిడిపి కార్యదర్శిగా వడ్డీల నాగేశ్వరరావు ,తల్లాడ టిడిపి మొక్క కృష్ణార్జున్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా పరుచూరి. క్రిష్ణ, ను నియమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల తెలుగు యువత శీలం నర్సిరెడ్డి లికూచి పూడి. వెంకటేశ్వరరావు, ధూపాటి భద్రరాజు, రావూరి రవి ప్రసాద్, రామారావు, పోతురాజు కృష్ణ, ప్రసాద్, వెంకటి, నార పోగు ప్రసాద్, ఎస్ కే బాబు, చల్ల నాగయ్య, మొక్క కృష్ణార్జున,
దుగ్గినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ, , టెంట్ హౌస్ సురేష్ బాబు, కొమ్మినేని రాము, నీలం ప్రభాకర్, దొనేష్, చల్లా. వెంకన్న, వజీర్, వెంకటేశ్వరావు మండల అధ్యక్షులు టౌన్ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## బయట మార్కెట్లో అధిక ధరలకే ఎరువులు



**మునగపాక మండలం సీ కే న్యూస్ జూన్ 17:**అనగా అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక %ూూ% గారికి రైతులకు సరైన సమయంలో ఎరువులు అందడం లేదని
కుటమి ప్రభుత్వంలో రైతులకు సరైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బయట మార్కెట్లో విచ్చలవిడిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయి. అధిక ధరలతో బయట మార్కెట్లో ధరలు:330 నుంచి 350 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం సహకార సంఘాల్లో రైతు భరోసా కేంద్రంలో ధరలు:272 కే ఇస్తుంటే బయట మార్కెట్లో అధిక ధరలతో రైతన్నలు తీవ్రమైన ఇబ్బందికి గురవుతున్నారు. %ూూ% గారికి వైఎస్ఆర్సీపీ అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ మరియు మునగపాక మండలం ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులందరు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి.




జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 17,** గోదావరి వరదలు వల్ల ప్రజలకు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో గోదావరి వరదలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మరియు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రతి అధికారి వాహనంలో లైఫ్ జాకెట్లు,టార్చి లైటు, తాడు, హ్యాండ్ మైకు, అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు ఫ్లడ్ మేనేజ్మెంట్ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. వరద ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముంపుకు గురయ్యే వరకు వేచి ఉండకుండా ముందస్తుగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. వరదల నుండి ప్రజలను కాపాడేందుకు గ్రామస్థాయి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం చేసిన అంశాల పట్ల అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వరదల్లో చిక్కుకున్న వ్యక్తులను రక్షించేందుకు లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, నాటుపడవలు, బోట్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. రానున్న మూడు నెలల వరకు అనగా అక్టోబర్ మాసం వరకు సరిపోను అన్ని రకాల నిత్యావసర వస్తువులు స్టాకు ఉంచాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. వరద ముంపు చర్యలు పర్యవేక్షణకు సెక్టోరియల్, జోనల్ అధికారులను నియమించనున్నట్లు చెప్పారు. వరద యొక్క సమాచారాన్ని ప్రజలకు చేరవేసేందుకు ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నెంబర్లును అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా పంచాయతీరాజ్, విద్యుత్తు శాఖ అధికారులు ముందస్తుగానే ముంపు గ్రామాల్లో పరిశీలన చేయాలని చెప్పారు. ముంపుకు గురయ్యే అవకాశాలున్న ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టి విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు.
అత్యవసర సేవలకు హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవడానికి అనుగుణంగా హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులకు సూచించారు. అత్యవసర సేవలు కొరకు మొబైల్ సెట్లు వినియోగించేందుకు సెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గోదావరికి పై నుండి వచ్చే వరద సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేస్తుండాలని చెప్పారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు విషయంలో ప్రాధాన్యతలను తెలియచేయడంతో పాటు ఇబ్బందులు రాకుండా ముందస్తుగానే ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కిన్నెరసాని వంటి ప్రాజెక్టులు గేట్లు ఎత్తు సమయంలో ప్రభావిత ప్రాంతాలకు ముందస్తుగా తెలియజేయు విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.
పునరావాస కేంద్రాల్లో ఆహారాన్ని తయారు చేసేందుకు వంట చేసే సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని చెప్పారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేయు చేయు విధంగా ఫ్లడ్ కంట్రోల్ రూము ఏర్పాటుతో పాటు మండల, జిల్లాస్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని చెప్పారు. వరదల సమయంలో గర్భిణి మహిళలు ఇబ్బందులు. పడకుండా ముందస్తు జాబితాను సిద్ధం చేసి సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పించు విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ఈడీ క్యాలెండర్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.వైద్య శాఖ 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, సిబ్బందికి ప్రమాదం జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, ప్రాథమిక వైద్యం పై శిక్షణ నిర్వహించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.వరదల సమయంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతుంటాయని ప్రజలు దాటే ప్రయత్నం చేయకుండా బారికేడింగ్ చేయాలని చెప్పారు. వాగులు దాటించడం వల్ల ప్రజలతో పాటు పశువులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయని, కాబట్టి ముందస్తుగానే సమాచారం ప్రజలకు చేరవేసి రక్షణ చర్యలు పాటించు విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వరదల సమయంలో అత్యవసర వైద్యసేవలకు అంతరాయం లేకుండా మందులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పాము, తేలు కాటు వంటి విష జంతువులకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని, వ్యాక్సిన్ అందక ఎటువంటి ప్రాణ నష్టం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులకు తెలిపారు . సింగరేణి, కేటిపిఎస్, ఐటిసి, నవభారత్ తదితర సంస్థల రెస్క్యూ టీముల సేవలు వినియోగించుకునేందుకు జాబితా అందుబాటులో ఉంచాలని చెప్పారు. వర్షాకాలంలో పశువులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయు కార్యక్రమాలను చేపట్టాలని పశుసంర్ధక అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో పశువులు ప్రమాదాలకు గురి కాకుండా వాటిని పెద్ద తాడుతో కట్టివేసించాలని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గుత్తికోయ ఆవాసాల్లో పర్యటించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. లయింగ్ ఏరియాల్లో నీటి నిల్వలు లేకుండా డ్రెయిన్ల పరిశు భ్ర పరచడం, డ్రైయిన్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. విస్తా కాంప్లెక్సు, అశోక్ నగర్ నీటి నిల్వలు లేకుండా ఎత్తిపోసేందుకు మోటార్లును అందుబాటులో ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వరదనీరు నిల్వ లేకుండా వెళ్లేందుకు డ్రెయిన్లను పరిశుభ్రం చేయాలని చెప్పారు. నీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న ప్రాజెక్టులు వాటి యొక్క గేట్ల మరమ్మత్తులను తక్షణమే పూర్తి చేయాలని, వాటి యొక్క పనితీరును పరిశీలించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని బ్లీచింగ్, సోడియం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని స్ప్రే చేయించాలని చెప్పారు. మంచినీరు సఫరాకు ఇబ్బంది రాకుండా చూడాలని నీటి వనరులు ముంపుకు గురైతే మంచినీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నయ చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. 73 అడుగులు గోదావరి వరదలు వచ్చినప్పటికీ ఎదుర్కొనే విధంగా అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి మరియు పంచాయతీరాజ్ అధికారులు తమ పరిధిలోని లోవర్ బ్రిడ్జిలను గుర్తించి ప్రణాళికలు అందించాలని ఆదేశించారు. అన్ని లో లెవెల్ బ్రిడ్జిలు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు 15 లోపు తూర్పాక హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పరిధిలోని మంజూరు అయిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ అధికారులు కెనాల్, ప్రాజెక్టుల వద్ద సుబాబులు మరియు సిస్సు మొక్కలను విస్తృతంగా నాటాలన్నారు. అధికారులందరూ కార్య స్థానం విడిచి వెళ్లరాదని క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.విధి నిర్వహణలో అలసత్వం వలన ఏ ఒక్క ప్రాణ నష్టం జరిగినా సంబంధిత అధికారుల పైన కఠిన చర్యలు ఉంటాయని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.
అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ..
ధర్తీధన్ భాగీదారీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు ఆధార్ కార్డ్ నమోదులు మరియు నవీకరణలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ జారీ, జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు తెరవడం, %ూవీ%-కిసాన్ యోజన నమోదులు, పెన్షన్ పథకాల నమోదులు, స్కాలర్షిప్‌లు, బీమా పథకాలు, నైపుణ్య శిక్షణ, జీవనోపాధి కార్యక్రమాల నమోదు వంటి కీలకమైన ప్రభుత్వ సేవలను పొందేందుకు గ్రామం మరియు నివాస శిబిరాలను 15 రోజులపాటు నిర్వహించాలన్నారు. ఈ శిబిరాల ద్వారా అర్హత కలిగిన ఏ ఒక్క గిరిజన కుటుంబాన్ని వదిలిపెట్టకుండా అందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, అన్ని శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీ కే న్యూస్ కథనానికి స్పందించిన ఫుడ్ ఇన్స్పెక్టర్






- రైస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు
- ట్రేడ్ లైసెన్స్ కూడా లేకుండా నిర్వహిస్తున్న రైస్ గ్రాండ్ రెస్టారెంట్
- శాంపిల్స్ సేకరించిన అధికారులు.. 14 రోజుల తర్వాత రానున్న రిపోర్ట్స్.
- సంఘటన జరిగిన వెంటనే శాంపిల్స్ సేకరిస్తే బాగుండేదంటున్నా ప్రజలు
- ఏది ఏమైనాఅప్పటికి 14 రోజులు వేచి చూడాల్సిందే

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ,జూన్ 17,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం సెంట్ మేరీస్ స్కూల్ ఎదురు పోస్ట్ ఆఫీస్ వద్ద నేషనల్ హైవే ఆనుకొని రైస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ కు అనుమతులు లేకుండా రుచి, శుచి, శుభ్రత పాటించకుండా భోజన ప్రియులకు కుళ్లిన ఆహార పదార్థాలు వడ్డిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్న రైస్ గ్రాండ్ హోటల్ నిర్వాకం పై సీ కే న్యూస్ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సోమవారం ఆ రెస్టారెంట్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. శాంపిల్సును సేకరించి కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సేకరించిన నమూనాలు ల్యాబ్ కు పంపించి పరీక్షలు నిర్వహిస్తామని, 14 రోజుల తర్వాత వాటికి సంబంధించిన రిపోర్టులు వస్తాయని అనంతరం వాటిని ఉన్నతాధికారులకు అందజేస్తామని నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చినట్లు రుజువైతే ఉన్నతాధికారుల ఆదేశాలకు మేరకు అవసరమైతే హోటల్ ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఉపేక్షించబోమని తేల్చి చెప్పారు. ఈ హోటల్ పై గతంలోనూ అనేక ఆరోపణలు వెల్లువెత్తాయని, ఇటీవల ఓ మహిళ కుటుంబం కల్తీ ఆహార పదార్థాలు భుజించినట్లు ఫిర్యాదు చేసిందని, మరో సారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని హెచ్చరించినట్లు ఫుడ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. తాజాగా తీసుకున్న శాంపిల్స్ ఫలితాలు 14 రోజుల్లో వెల్లడవుతాయని, ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటించారు. ట్రేడ్ లైసెన్సు కచ్చితంగా ఉండాలని రైస్ గ్రాండ్ హోటల్ కు లేకపోవడంతో కచ్చితంగా ఉండాలని రైస్ గ్రాండ్ యజమానియానికి హెచ్చరించినారు. హోటల్ పెట్టాలంటే ఎటువంటి అనుమతులు ఉండాలని సీ కే న్యూస్ దినపత్రిక ప్రతినిధి ఫుడ్ ఇన్స్పెక్టర్ ని అడగడంతో ఫుడ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ముందుగా హోటల్ ప్రారంభించాలంటే జీఎస్టీ హోటల్కుండాలని ట్రేడ్ లైసెన్స్ కూడా ఖచ్చితంగా ఉండాలని రైస్ బ్రాండ్ హోటల్ కు ట్రేడ్ లైసెన్స్ లేకపోవడంతో ఆగ్రహించిన ఫుడ్ ఇన్స్పెక్టర్.. దీనితో సర్ది చెప్పే ప్రయత్నం చేసిన హోటల్ రెస్టారెంట్ యాజమాన్యం.. మరి ట్రేడ్ లైసెన్సు లేకుండా ఎలా నడిరోడ్డుపై అక్రమంగా రెస్టారెంట్ నిర్మించి వాహనదారుల కు ఇబ్బందులు కలిగిస్తున్నప్పటికీ ఒక అధికారి కూడా స్పందించకపోవడం శోచనీయం. మరి ఇప్పటికైనా కార్పొరేషన్ కమిషనర్ స్పందించి ట్రేడ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న రెస్టారెంట్ పై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రేడ్ లైసెన్స్ కూడా లేకుండా నిర్వహిస్తున్న రెస్టారెంట్ పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.



## వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తా...

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



చౌటుప్పల్.జూన్ 17. సీ కే న్యూస్ ప్రతినిధి,వికలాంగుల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి మోడల్ కాలనీగా తీర్చిదిద్ది వికలాంగులకు అందించే విధంగా కృషి చేస్తానని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు.హైదరాబాదులో మాజీ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు వరగంటి రాజేందర్ గౌడ్ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను తన నివాసంలో కలిసి వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు. వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుని అడగగా వెంటనే స్పందించి వికలాంగుల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్ళను అందించే విధంగా కృషిచేసి వికలాంగుల మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉడుగు యాదయ్య గౌడ్,వరగంటి మహేందర్ గౌడ్, బొమ్మగోని రవి గౌడ్ పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకెన్




మహబూబాబాద్ జిల్లా బయ్యారం సీ కే న్యూస్ ప్రతినిధి,బయ్యారంలో స్థానిక పోలీస్ స్టేషన్ ను మహబూబాబాద్ జిల్లా ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకెన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు.పెండింగ్ కేసులపై ఆరా తీశారు.ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడేలా అవగాహన కల్పించాలని అన్నారు.నిత్యం ఇసుక అక్రమ తొలకలను అరికట్టాలని,గంజాయి అక్రమ రవాణా,యువకులు గంజాయి బారిన పడకుండా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని,అదేవిదంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేయాలని,బాలికలకు, యువతులకు,మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు,సీఐ రవి కుమార్,ఎస్ఐ తిరుపతి,ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఆంధ్రప్రదేశ్ తెలంగాణ లో జిల్లాల వారీగా ఆర్.టి.ఐ 2005 చట్టం పై అవగాహన సదస్సులు - అధ్యక్షులు డాక్టర్ సుమిత్రానంద న్.



ఏలూరు జంగారెడ్డిగూడెం సీ కే న్యూస్ ప్రతినిధి,ఏలూరు జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి హెచ్ సుమిత్రానందన్ జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం వ్యవస్థపక అధ్యక్షులు డాక్టర్ బి .హెచ్ సుమిత్రానందన్, మాట్లాడుతూ గత 6 నెలలు గా ఏపీ లో సుమారు 15 జిల్లాల్లో తెలంగాణ లో 5 జిల్లాల్లో ఆర్.టి.ఐ 2005 చట్టంపై సమావేశాలు అవగాహన సదస్సులు నిర్వహించాము అని తెలిపారు . అదేవిధంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆర్టిఏ 2005 చట్టం బోర్డులు ఏర్పాటు చేసేలా అధికారులు చూడాలన్నారు . సమాచారం ఇవ్వని నిర్లక్ష్య అవినీతి అధికారులకు ప్రభుత్వ ఆర్టిఐ ఇన్ఫర్మేషన్ కమిషనర్ లు ఫైన్ విధించాలన్నారు . జిల్లా అధ్యక్షులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి అన్నారు .మహిళల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు.

## 35 వార్డు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఉచితంగా యూనిఫామ్ పాఠ్యపుస్తకములు విల్లూరి చేతుల మీదుగా పంపిణీ




సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జూన్ 17 : సర్వేపల్లి రాధాకృష్ణమిత్ర పథకం కింద విశాఖ దక్షిణ నియోజకవర్గం 35 వార్డు పరిధిలో ఉన్న స్కూళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో విశాఖ దక్షిణ నియోజక వర్గం 35వ వార్డులో ఉన్న స్కూలు పిల్లలకు ఉచితంగా స్కూల్ యూనిఫామ్ విద్య పాఠ్యపుస్తకములు స్కూల్ బ్యాగ్ అలాగే బెల్టు మరియు డైట్ కిట్టు చాలా హైజినిక్ గా ఉన్నవి 35 వ వార్డ్ కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినది కార్యక్రమ%శీ% లో 35వ వార్డు టిడిపి వార్డు ప్రెసిడెంట్ బుచ్చా రాము 35 వ వార్డు సెక్రటరీ బత్తి మంగరాజు కోక్లస్టర్ మున్నం బాలా పాఠశాల అధ్యాపకులు 35 వ వార్డు టిడిపి నాయకులు పాల్గొనడం జరిగింది.

## జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ తనదైన ప్రత్యేకతను చాటారు



● తుంబూరు దయాకర్ రెడ్డి

సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం : జిల్లా కలెక్టర్ గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వర్తించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ముజమ్మిల్ ఖాన్ ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్ రెడ్డి మంగళవారం కలిసి ఆయన సేవలను కొనియాడుతూ బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.... జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి బదిలీ అయ్యేంత వరకు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఆ బాధ్యత కలెక్టర్లదే..

మంత్రి పొంగులేటి కీలక ఆదేశం



సికె న్యూస్ ప్రతినిధి

తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని, గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

భూ భారతి చట్టం ద్వారా ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని మంగళవారం తనను కలిసిన జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు. కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు, బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే రెండు నెలలు రెవెన్యూశాఖకు అత్యంత కీలకమైనవని, భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలై ఏడాదిన్నర అవుతుందని, ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమం అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పని చేయాలని సూచించారు.

# రోడ్ల నిర్మాణంలో నాణ్యతపై రాజీ పడేది లేదు

- నియోజకవర్గంలోని ప్రతి రోడ్డు 5.5 మీటర్ల వెడల్పు ఉండాల్సిందే...
- రోడ్ల నిర్మాణ పనితీరు పై అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం....
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**చౌటుప్పల్.జూన్ 17.** మునుగోడు నియోజకవర్గం లోని ప్రతి రోడ్డు 5.5 మీటర్లు వెడల్పు ఉండాల్సిందేనని, రోడ్ల నిర్మాణంలో నాణ్యత పై రాజీ పడేది లేదని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై మునుగోడు లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో మంగళవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. వీటితోపాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రొసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు. వీటితోపాటు నియోజకవర్గంలో హెచ్ ఏ ఎం కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై అధికారులతో ఆయన చర్చించారు. అలాగే
పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు.ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు.ఇవే కాకుండా మరో 34 పి ఆర్ రోడ్లు టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు.

నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు.

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని,నాణ్యత గల రోడ్ల నిర్మాణం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని ఉందని కాంట్రాక్టర్లకు సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లు, పంచాయతీరాజ్ ఈ.ఈ గిరిధర్, ఆర్ అండ్ బి మునుగోడు డి ఈ శరత్ చంద్ర, పి ఆర్ ఎ ఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

# మళ్లీ అదే టీం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరొకసారి ఐప్యాక్ పై ఆధారపడుతున్నారా? అంటే అవుననే అనిపిస్తుంది. ఈసారి కూడా ఐ ప్యాక్ టీంతో నే ఎన్నికలకు వెళ్లాలని ఆయన నిర్ణయించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని తనకు అప్పగించడమే కాకుండా ఎప్పటికప్పుడు నివేదికలను అందించడానికి ఐ ప్యాక్ టీం ను తిరిగి యాక్టివ్ చేయాలని వైఎస్ జగన్ నిర్ణయించారు. ఈ మేరకు గత ఎన్నికల్లో పనిచేసిన వారిని ఈసారి కూడా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరోసారి సర్వేలకు రెడీ అవ్వాలని ఐ ప్యాక్ టీంను ఆదేశించినట్లు తెలిసింది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత ఐప్యాక్ కార్యాలయాన్ని కూడా తీసి వేశారు.

**నివేదికలు అందాలంటే...**

అయితే తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. జనంలో మంచి ఊపు ఉందని, అయితే ఫీల్డ్ లెవెల్ లో తనకు ఖచ్చితమైన సమాచారం తెలియాలంటే ఐ ప్యాక్ టీం అవసరాన్ని గుర్తించిన జగన్ మరోసారి దానిని రంగంలోకి దించాలని నిర్ణయించారని తెలిసింది. త్వరలోనే ఐ ప్యాక్ టీం తిరిగి ఆంధ్రప్రదేశ్ లో కార్యక్రమాలను ప్రారంభిస్తుందని కూడా పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు 2019లో అధికారాన్ని తెచ్చిపెట్టిన ఐ ప్యాక్ సంస్థ మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత దుకాణం మూసివేసింది. ఈ సంస్థ బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ దే అయినప్పటికీ ఆయన 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన బీహార్ రాజకీయాలకు పరిమితమయ్యారు. దీంతో ఐప్యాక్ సంస్థలో పనిచేసిన వారు దానిని నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికలకు కూడా వైఎస్ జగన్ మరోసారి గెలిచేందుకు ఐప్యాక్ సంస్థను కొనసాగించారు. ఐప్యాక్ సంస్థకు రుషిరాజ్ నేతృత్వం వహించారు.

**మళ్లీ రుషిరాజ్ నేతృత్వంలోనే?**

తిరిగి రుషిరాజ్ నేతృత్వంలోనే ఐ ప్యాక్ సంస్థ పనిచేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. జనాభా గణన మొదలు కానుండటంతో పాటు 2027లో ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంతో జమిలి ఎన్నికల నేపథ్యంలో ఐ ప్యాక్ ను త్వరగానే రంగంలోకి దించాలని వైఎస్ జగన్ భావిస్తున్నార. ఎప్పటి లాగానే ఐ ప్యాక్ సంస్థ అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకూ, సోషల్ మీడియాలో ప్రచారం వరకూ అంతా తానే చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఒక్కోసారి వైఫల్యాలు ఉంటాయని, అది జనం మనసులను అంచనా వేయడంలో తప్పు అయినా, దాని అవసరం తమకు ఉందని గుర్తించిన జగన్ తిరిగి ఐ ప్యాక్ ను రెడీ చేస్తున్నట్లు తెలిసింది.

**ఏడాది కావడంతో...**

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం మారి ఏడాది పూర్తి కావస్తుండటంతో ప్రస్తుతం సోషల్ మీడియా తనకు ప్రధానం కావడంతో ఇటు వైసీపీ సోషల్ మీడియాకు తోడు ఐ ప్యాక్ సంస్థ కూడా ఉంటే ఇంకొంత ప్రయోజనం ఉంటుందని జగన్ భావించి వారితో చర్చలు జరిపినట్లు తెలిసింది. త్వరలోనే అంటే రెండు మూడు నెలల్లో ఐ ప్యాక్ సంస్థ తిరిగి వైసీపీ కోసం తిరిగి ఆంధ్రప్రదేశ్ లో పనిచేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. జగన్ కూడా ఇక జిల్లాలను పర్యటిస్తుండటంతో పాటు పాదయాత్ర చేయాలన్న ఆలోచన కూడా ఉండటంతో ఐ ప్యాక్ ను రంగంలోకి దించితే మరింతగా జనానికి చేరువయ్యేందుకు ఉపయోగపడుతుందని జగన్ భావించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# మొటిమంత బెంగ

**ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు.**

**ఇది మొటిమల అవగాహన మాసం**

ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు. తెగ ఆందోళన పడిపోతుంటారు. మనో వేదనకూ గురవుతుంటారు. మొటిమల మీద లెక్కలేనన్ని అపోహలూ రాజ్యమేలుతుండటం, సరైన అవగాహన లేకపోవటమే దీనికి కారణం.

అప్పటివరకూ నునుపుగా ఉన్న ముఖం మీద ఏంటీ మొటిమలు? ఒకట్రెండు కాస్తా చూస్తుండగానే సంఖ్య పెరుగుతూ వస్తోందేంటి? అందానికి, ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే యుక్తవయసువారిలో ఇలాంటి ఆలోచనలే ముసురుకుంటుంటాయి. ఇంతకీ ఇవి ఎలా పుట్టుకొస్తాయి? ఆశ్చర్యంగా అనిపించినా చర్మం నిగనిగలాడుతూ కనిపించటానికి తోడ్పడే చమురు గ్రంథులే మొటిమలకు కారణం! శరీరం మీద చర్మం అంతటా సన్నటి వెంట్రుకలు, వాటి కుదుళ్లుంటాయి. ప్రతి కుదురులో వెంట్రుక మొదలు (ఫాలికల్), చమురు గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) ఉంటాయి. గ్రంథుల నుంచి ఉత్పత్తయ్యే చమురు సన్నటి రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. ముఖం, ఛాతీ, వీపు, భుజాలు, చేతుల మీద ఈ గ్రంథులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఇవి వాచి, ఉబ్బి.. గుల్లల మాదిరిగా పైకి పొడుచుకు రావటమే మొటిమలకు మూలం. కొందరిలో జన్యుపరంగా టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు గ్రంథులను ప్రేరేపితం చేయటం వల్ల మరింతగా చమురు ఉత్పత్తి అవుతుంది. మరోవైపు చర్మ రంధ్రాల్లో ప్రొపిని బ్యాక్టీరియం ఆక్నిస్ అనే బ్యాక్టీరియా చమురును కొవ్వు ఆమ్లాలుగా విడగొడుతుంటుంది. ఈ ఆమ్లాలు వెంట్రుక కుదురును ప్రేరేపించే క్రమంలో కెరటిన్ పదార్థం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, చర్మ రంధ్రాలు మూసుకుపోవచ్చు. దీంతో అక్కడ ఉబ్బుగా, గుల్ల మాదిరిగా ఏర్పడి.. మొటిమ తలెత్తుతుంది. ఇది క్రమంగా పెద్దగా అవుతూ రావొచ్చు. కొన్నిసార్లు చర్మ రంధ్ర మార్గం పగిలి, వాపు మొదలవ్వచ్చు. ఫలితంగా అక్కడ ఎర్రబడి, మొటిమ పొక్కులా పొడుచుకొస్తుంది. లోపల చీము చేరటం, చితకటం, గుంతలు పడటం.. అన్నీ దీని పర్యవసానాలే.

**నాలుగు రకాలు**

సాధారణంగా మనం మొటిమలన్నింటినీ ఒకే గాటన కట్టేస్తుంటాం. కానీ తెలుపు లేదా నలుపు గుల్లలు (బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్), చీము గుల్లలు (పశ్చులే), తిత్తులు (సిస్ట్స్).. ఇలా మొటిమలు రకరకాలుగా ఉంటాయి. తీవ్రతను బట్టి వీటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు.

**గ్రేడ్ 1:** చాలా సన్నగా, చిన్నగా ఉండేవి (కొమెడోన్స్). వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్ ఇలాంటివే.

**గ్రేడ్ 2:** బ్లాక్‌హెడ్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము పట్టడం (పశ్చు లర్).

**గ్రేడ్ 3:** గుల్లలు ఇన్‌ఫెక్షన్‌తో వాచి, గడ్డ మాదిరిగా అవటం (నాడ్యులర్).

**గ్రేడ్ 4:** గడ్డ మరీ పెద్దగా, లావుగా ఉబ్బటం (నాడ్యులోసిస్టిక్).

ఆడవారిలో ఎక్కువ

మగవారిలో కన్నా ఆడవారికి మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఎందుకంటే వీరిలో హార్మోన్ల వ్యత్యాసాలు ఎక్కువ. ఆడవారిలో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓఎడీ), నెలసరి సరిగా రాకపోవటం, థైరాయిడ్ పనితీరు దెబ్బతినటం, టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులు అస్తవ్యస్తం కావటం వంటివీ మొటిమలు ఎక్కువగా వచ్చేలా చేయొచ్చు.

ఏ వయసులోనైనా..

మొటిమలు యుక్తవయసులోనే వస్తుంటాయని, ఆ తర్వాత వాటంతటవే పోతాయని చాలామంది భావిస్తుంటారు. నిజానికి వీటికి ఒక వయసంటూ లేదు. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా రావొచ్చు. కానీ సగటున 10–25 ఏళ్ల వయసులో ఎక్కువగా చూస్తుంటాం. అలాగని అక్కడితోనే ఆగిపోతాయని కచ్చితంగా చెప్పలేం. కొందరికి 20ల్లో, 30ల్లో, 40ల్లోనూ రావొచ్చు. కొందరు మహిళలకు యుక్తవయసులో కొద్దిగానే మొటిమలు వచ్చినా పెద్దయ్యాక తీవ్రంగానూ వేధించొచ్చు.



**ముఖం మీదే కాదు..**

మొటిమలు చాలావరకూ.. 99% ముఖం మీదే వస్తుంటాయి. నుదురు, బుగ్గలు, ముక్కు మీద ఇవి కనిపిస్తుంటాయి. చమురు గ్రంథులు లేకపోవటం వల్ల పెదవులు, పెదవుల పైభాగంలో మాత్రం రావు. కొందరికి ముఖం మీదే కాదు.. ఛాతీ, వీపు, చేతుల మీద కూడా రావొచ్చు.

**గిల్లితే తగ్గవు**

మొటిమలను గిల్లి, నొక్కి పిండితే త్వరగా తగ్గుతాయని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. గిల్లితే మొటిమలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శాశ్వతంగా మచ్చలు పడొచ్చు. ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు చొచ్చుకెళ్లి ముఖం మీద గుంతలు పడే ప్రమాదముంది. ఒకసారి గుంత పడితే పూర్తిగా మామూలు స్థాయికి తీసుకొచ్చే చికిత్సలేవీ లేవు. కాకపోతే గుంతల లోతును తగ్గించి, అంతగా కనిపించకుండా చేయొచ్చు.

**గట్టిగా రుద్ది కడిగితే పోవు**

ముఖాన్ని గట్టిగా, రుద్ది కడిగితే మొటిమలు పోతాయనుకోవటం అపోహ. దీంతో మొటిమలు తగ్గటం అటుంచి, మరింత ఎక్కువవుతాయి. ఇన్‌ఫెక్షన్ లోపలికి వెళ్లిపోయి, గుంతలు పడే అవకాశముంది. గట్టిగా రుద్దటం కన్నా రోజుకు రెండు సార్లు మృదువుగా తేలికైన, పరిమళం లేని క్లీన్సర్‌తో ముఖాన్ని కడుక్కోవటం మంచిది. వేలి చివర్లతో క్లీన్సర్‌ను ముఖానికి రాసుకోవాలి. అనంతరం గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.

కొందరు చర్మం రంధ్రాలు విప్పారతాయనే భావనతో ఆవిరి స్నానాలు చేస్తుంటారు. కానీ వీటితో మొటిమలు మరింత ఎక్కువవుతాయి.

**ఆహారంతో పరోక్ష సంబంధం**

రాత్రిపూట జంక్‌ఫుడ్ తిన్నా.. ఎక్కువ కేలరీల ఆహారం తిన్నా మొటిమలు ఎక్కువగా పుట్టుకురావొచ్చు. ఎందుకంటే శరీరం వాడుకోకుండా మిగిలిన కేలరీలు ఒంట్లో కొవ్వుగా మారతాయి. వీటి నుంచి టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు పుట్టుకొచ్చి మొటిమలను ప్రేరేపిస్తాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత జంక్‌ఫుడ్, పెద్దమొత్తంలో పిండి పదార్థాలు.. పాల పదార్థాలు (పెరుగు మినహాయించి) తీసుకోవటం మానెయ్యాలి. స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు పదార్థాల వంటివి తగ్గించుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారంతో మొటిమల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విటమిన్ ఏతో కూడిన పాలు (పగటిపూట), క్యారెట్, క్యాబేజీ, చిలగడ దుంపలు.. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు గల చేపలు, అక్రోట్లు.. జింక్‌తో కూడిన పదార్థాలు మొటిమలు ఉద్ధృతం కాకుండా కాపాడతాయి.

**పౌడర్ కారణం కాదు**

కొందరు ముఖానికి పౌడర్ రాసుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయని భావిస్తుంటారు. ఇది అపోహే. కాకపోతే గాఢమైన కెమికల్ పీల్స్‌తో చమురు గ్రంథులు ఇంకాస్త పెద్దగా అవ్వచ్చు. ఫలితంగా మొటిమలు ఉద్ధృతమవుతాయి. కొన్ని స్టెరాయిడ్ క్రీములతోనూ ఇవి ఎక్కువ కావొచ్చు. కాబట్టి కెమికల్ పీల్స్ వాడకపోవటం మంచిది. సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్లయినా సరే.. నాన్ కొమెడోజెనిక్ రకానికి చెందినవే ఉపయోగించాలి.

**ఒత్తిడికి దూరంగా**

మానసిక ఒత్తిడి, ఆందోళనలు మొటిమలకు కారణం కాకపోయినా అప్పటికే ఉన్నవి ఉద్ధృతమయ్యే అవకాశముంది. కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి.

**చికిత్స అవసరమా?**

మొటిమలు ఆరోగ్యానికేమీ హాని కలిగించవు. కానీ వీటితో గుంతలు పడితే జీవితాంతం అలాగే ఉంటాయి. కాబట్టి చికిత్స తీసుకోవటం మంచిది. కొత్తగా మొటిమలు వస్తున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ ఉన్నవి తగ్గకపోతుంటే మాత్రం చికిత్స అవసరం. అలాగే చీము పట్టటం, గడ్డలు ఏర్పడటం, ముఖమంతా నల్లటి మచ్చల్లా మారుతున్నా తాత్సారం చేయరాదు. చికిత్స ఉద్దేశం– మొటిమలు ఉద్ధృతం కాకుండా చూడటం.. తీవ్ర స్థాయి నుంచి స్వల్ప స్థాయికి తీసుకురావటం. సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి మొటిమలు నియంత్రణలోకి వస్తాయి. అప్పటివరకూ డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే గుంతలు, మచ్చలు పడకుండా చూసుకోవచ్చు.

**ఏంటీ చికిత్స**

మామూలు వైట్, బ్లాక్‌హెడ్స్‌కు రెటినాల్ క్రీములు మేలు. ఇవి గడ్డకట్టిన కెరటిన్ విడిపోయేలా, చర్మ రంధ్రాలు తెరచుకునేలా చేస్తాయి.

చీము పడితే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

మరీ తీవ్ర మొటిమలకు రెటినాయిడ్, విటమిన్ ఏ మాత్రలు ఉపయోగపడతాయి. ఇవి చమురు ఉత్పత్తిని తగ్గించి, రంధ్రాలు తిరిగి తెరచుకునేలా చేస్తాయి. అయితే వీటిని 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసువారికే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు డాక్టర్ సలహా తీసుకోకుండా తమకు తామే విటమిన్ ఏ మాత్రలను వేసుకోవటం ఎక్కువైంది. ఇది ప్రమాదకరం. యుక్తవయసులో ఇవి ఎదుగుదలను, చూపును దెబ్బతీయొచ్చు. సంతానం కోసం ప్రయత్నిస్తున్నవారు, గర్భిణులు, బాలింతలు వీటిని వాడటం మంచిది కాదు. కాబట్టి రక్త పరీక్ష చేయించుకొని, డాక్టర్ పర్యవేక్షణలోనే ఒక వయసు వచ్చేవరకూ వాడి, మానెయ్యాలి.

రెటినాల్ క్రీములు పడనివారికి శాల్సిలిక్ యాసిడ్ పీల్స్ మేలు చేస్తాయి.

మందులతో ఫలితం కనిపించవారికి, మందులు వాడటం కుదరనివారికి లేజర్ చికిత్సతో ఫలితం కనిపిస్తుంది. చికిత్సలతో రాత్రికి రాత్రే మొటిమలు తగ్గుతాయని అనుకోవద్దు. ఇవి పని చేయటానికి 4–8 వారాలు పడుతుంది.

**మచ్చలు, గుంతలు పడితే?**

మొటిమలతో మచ్చలు, గుంతలు పడితే చర్మం రకం, వయసు, జీవనశైలి, మచ్చల రకాన్ని బట్టి డెర్మారోలర్, కెమికల్ పీల్, మైక్రోనీడ్లింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ, ఫ్రాక్షనల్ సీవో2 లేజర్, ఎర్బియం యాగ్ లేజర్.. వీటిల్లో ఏదో ఒకదాంతో చికిత్స చేయొచ్చు. లేజర్లు చర్మం కిందుండే కొలాజెన్‌ను దెబ్బతీస్తాయి. తర్వాత అక్కడ కొత్త కొలాజెన్ ఏర్పడుతుంది. ఈ క్రమంలో మచ్చలు, గుంతలు తగ్గుతాయి. అయితే గుంతలు పూర్తిగా పోవని గుర్తించాలి. 60–70% మాత్రమే పూడతాయి. గుంతలు ముఖానికి ఇబ్బంది కలిగించటం లేదని అనుకునేంతవరకూ చికిత్స తీసుకోవచ్చు.

## మేఘా శుక్లా: ది ఎరా ఆఫ్ ఆషికీ లైవ్స్ ఆన్




# సుశాంత్ ఈసారి గట్టి ప్లానింగ్ తోనే..!

అక్కినేని ఫ్యామిలీ హీరో సుశాంత్ 2021 లో ఇచ్చుట వాహనములు నిలుపరాదు సినిమా చేశాడు. ఆ తర్వాత గ్యాప్ తీసుకున్నాడు. అల వైకుంఠపురములో, భోళా శంకర్, రావణాసుర సినిమాల్లో నటించినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. అందుకే ఆఫ్టర్ షార్ట్ గ్యాప్ మళ్లీ తన సోలో సినిమాతోనే రాబోతున్నాడు సుశాంత్. ఈసారి యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతున్నాడని తెలుస్తుంది. సుశాంత్ 10వ సినిమా అప్డేట్ అతని బర్త్ డే మార్చి 18న వచ్చింది. ఈ సినిమాను పృధ్వీరాజ్ చిట్టేటి డైరెక్ట్ చేస్తున్నాడు. సంజీవని క్రియేషన్స్ బ్యానర్ లో వరుణ్ కుమార్, రాజ్ కుమార్ కలిసి ఈ మూవీ నిర్మిస్తున్నారు. మిస్టరీ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్ లో సుశాంత్ 10వ సినిమా ఉంటుందని తెలుస్తుంది. సుశాంత్ ఈ ప్రాజెక్ట్ విషయంలో చాలా గట్టి ప్లానింగ్ లోనే ఉన్నాడని తెలుస్తుంది. ఫస్ట్ లుక్ తోనే సుశాంత్ అదరగొట్టాడు. హీరోగా కాస్త గ్యాప్ ఇచ్చి స్టార్ సినిమాల్లో వెయిట్ ఉన్న పాత్రలు వేస్తూ వచ్చాడు. ఐతే అవేవి సుశాంత్ కి సంతృప్తిని ఇవ్వలేదు. ఆడియన్స్ కూడా సుశాంత్ అలా సైడ్ రోల్స్ చేయడం ఇబ్బందికరంగా ఫీల్ అయ్యారు. అందుకే ఈసారి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో అదిరిపోయే కథతో వస్తున్నాడని తెలుస్తుంది. సుశాంత్ స్క్రిప్ట్ దశలోనే సినిమా గురించి చాలా ఎగ్జైట్ అవుతున్నాడని తెలుస్తుంది. అందుకే మార్కెట్ పెద్దగా లేకపోయినా ఈసారి బాక్సాఫీస్ దగ్గర తన సత్తా చాటాలని చూస్తున్నాడు. అక్కినేని హీరోల్లో సుశాంత్ కూడా తన ప్రయత్నాలు తను చేస్తున్నాడు. అప్పట్లో హీరోగా వరుస సినిమాలు చేసిన సుశాంత్ కాస్త గ్యాప్



ఇచ్చాడు. ఐతే సినిమాలు చేస్తుంటేనే ఏదో ఒక మంచి కథ పడి సక్సెస్ వస్తుంది. అందుకే సుశాంత్ కూడా అదే పంథా కొనసాగించాలని చూస్తున్నాడు. సుశాంత్ 10వ సినిమా ఎలా ఉంటుంది. అసలు ఎలాంటి సినిమాతో వస్తున్నాడు అన్నది ఆ ప్రాజెక్ట్ నుంచి ఏదైనా టీజర్ వస్తే తెలుస్తుంది. యువ దర్శకుడిగా పృథ్వీరాజ్ ఈసారి సుశాంత్ కి సూపర్ హిట్ ఇచ్చి తీరుతా అనే కాన్ఫిడెంట్ గా ఉన్నాడట. మరి ఈ కాంబో ప్రేక్షకులను ఎంతమేరకు మెప్పిస్తుందో చూడాలి. సుశాంత్ కూడా మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కి వరుస సినిమాలు చేయాలని ఉత్సాహపడుతున్నారు.

## ప్రియాంక KD తన స్వంత రన్‌వేపై రాకింగ్ చేస్తోంది



# పవన్ ఉస్తాద్ కూడా ఇదే ఏడాది అయితే...!




పవన్ కళ్యాణ్ చివరగా 2023లో 'బ్రో' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అంతకు ముందు ఏడాది అంటే 2022లో భీమ్లా నాయక్ సినిమా విడుదల అయింది. రాజకీయాల కారణంగా పవన్ కళ్యాణ్ సినిమాలకు చాలా బ్రేక్ వచ్చింది. సుదీర్ఘ కాలం తర్వాత పవన్ కళ్యాణ్ మూవీ విడుదలకు సిద్ధం అయింది. హరి హర వీరమల్లు సినిమాను ఈ నెలలోనే విడుదల చేయాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నెల చివరి వరకు లేదా వచ్చే నెలలో వీరమల్లు సినిమా విడుదల కన్ఫర్మ్ కావచ్చు. వీరమల్లు సినిమా విడుదల తేదీ విషయంలో ఇంకా క్లారిటీ రాకుండానే తదుపరి సినిమా ఓజీ రిలీజ్ విషయంలో ఫుల్ క్లారిటీ ఇచ్చారు. సాహో సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓజీ సినిమా షూటింగ్ పూర్తి అయింది. ఈ విషయాన్ని స్వయంగా చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. ఈ రెండు సినిమాలనే పవన్ కళ్యాణ్ చేస్తాడని అంతా అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా నేటి నుంచి ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. పవన్ కళ్యాణ్ నుంచి ఈ ఏడాది రెండు సినిమాలు రావడం కన్ఫర్మ్ అయింది. అయితే ఈ మధ్య కాలంలో పవన్ ఆ రెండు సినిమాలను ముగించిన జోరు చూస్తూ ఉంటే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా రెండు మూడు నెలల్లోనే పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే మరీ ఆలస్యం చేయకుండా ఇదే ఏడాదిలో ఉండే అవకాశం ఉంది. స్టార్ హీరోల సినిమాలు ఈమధ్య కాలంలో ఏడాదికి ఒకటి మాత్రమే విడుదల అవుతోంది. కొందరు హీరోలు ఏడాదికి ఒక్కటి కూడా విడుదల చేయలేక పోతున్నారు. కానీ పవన్ కళ్యాణ్ నుంచి మూడు సినిమాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పవన్ ఫ్యాన్స్ కి రెండు సినిమాలు విడుదల అయినా కూడా పండుగే అనడంలో సందేహం లేదు. అలాంటిది మూడు సినిమాలు విడుదల అయితే వారి ఆనందానికి అవధులు ఉండక పోవచ్చు. అంతే కాకుండా థియేటర్ల వద్ద సందడి ఓ రేంజ్‌లో ఉండే అవకాశం ఉంది. సినిమా ఇండస్ట్రీ బాగు పడాలి అంటే, సింగిల్ స్క్రీన్ థియేటర్లు నిలవాలి అంటే స్టార్ హీరోలు ఏడాదికి రెండు మూడు సినిమాలు చేయాలి అంటున్నారు. పవన్ కళ్యాణ్ నుంచి మూడు సినిమాలు వస్తే ముందు ముందు మరింత మంది ఇదే ఫార్ములాను పాటించే అవకాశాలు ఉన్నాయి. స్పీడ్‌గా తీసిన సినిమాలకు బడ్జెట్ తక్కువ అవుతుంది. అంతే కాకుండా నిర్మాతకు ఇబ్బందులు ఉండవు. హీరోలు ఎక్కువగా సినిమాలు చేసే అవకాశం ఉంటుంది. ప్రేక్షకుల పై టికెట్ల భారం తగ్గించే అవకాశం ఉంటుంది. కనుక పవన్ కళ్యాణ్ నుంచి ఈ ఏడాది మూడు సినిమాలు రావాల్సిందే అని అభిమానుల బలంగా కోరుకుంటున్నారు. హరీష్ శంకర్ తలుచుకుంటే కచ్చితంగా నవంబర్ లేదా డిసెంబర్ వరకు ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. పవన్ నుంచి ఏడాదికి రెండు సినిమాలు వచ్చి చాలా కాలం అయింది. ఇక మూడు సినిమాలు ఆయన కెరీర్ ఆరంభం నుంచి ఎప్పుడూ ఒకే ఏడాదిలో రాలేదు. కనుక ఉస్తాద్ భగత్ సింగ్ కూడా ఇదే ఏడాదిలో వస్తే అరుదైన రికార్డ్‌లు చాలానే నమోదు కావచ్చు.